

# ఖాకీలకు ఇది తగునా..?



హైదరాబాద్ వార్త

ఇలాంటి వారే టార్గెట్.. గృహహింస, వరకట్న వేధింపులు, భర్తతో కలహాలు, వేర్వేరు కాపురాలు వంటి కేసుల్లో పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిని పోలీసులు ఏమార్చుతున్నారు. కొంచెం అందంగా ఉంటే చాలు .. కన్నేస్తున్నారు. అలాంటి మహిళలతో మీకు సాయం చేస్తే మాకేంటి ..? అనే బేరాలు అలవోకగా సాగిపోతున్నాయి. దాంతో ప్రజల్లో పోలీసులపై నమ్మకం సన్నగిల్లిపోతుందనడంలో సందేహం లేదు. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు పరిగెత్తితే.. అమ్మో పోలీస్ స్టేషన్‌కా ?అనే అభిప్రాయాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఓవైపు శాంతి భద్రతలు పరిరక్షణలో ముందున్నాం.. షీటీమ్స్‌తో మహిళలపై నేరాలు అరికట్టాం.. అనే చెప్పే పోలీస్‌శాఖ ప్రతిష్టకు కొంతమంది పోలీసులు భంగం కలిగిస్తున్నారు. రక్షించినవారే వేధింపులకు పాల్పడుతున్నారు. ఇప్పటికే చాలామందిపై లైంగిక వేధింపుల కేసులు నమోదువుతున్నా మిగతా వారి ప్రవర్తనలో మాత్రం మార్పు రావడం లేదు.

ఒక్కొక్కటిగా బయటపడుతున్న ఉదంతాలు

కొద్దిమంది సిబ్బంది తీరుతో డిపార్టుమెంటుకు చెడ్డపేరు

- అధికారంతో అడ్డదారులు తొక్కుతున్న కొందరు ఆఫీసర్లు
- పలువురిపై హత్యాచారం, అక్రమసంబంధాల ఆరోపణలు

హైదరాబాద్, నవంబర్ 4,ప్రభాతవార్త: హైదరాబాద్‌లో ఖాకీల కామ లీలలు ఒకొక్కటిగా బయటపడుతున్నాయి. మహిళలు రక్షణ కల్పించాల్సిన పోలీసులు హత్యచారాలకు పాల్పడటం, అక్రమసంబంధాలు వంటివి పెట్టుకోవడం ఆందోళన కలిగిస్తుంది. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కొందరు అధికారులు ప్రజలకోసం నిజాయితీగా పనిచేసూనత ఆదర్శంగా ఉంటుంటే.. మరికొందరు మాత్రం ఆశాఖకు మచ్చతెస్తున్నారు. అధికారం ఉందన్న గర్వంతో, తమకు ఎదురుచెప్పే లేరన్న అహంకారంతో రెచ్చిపోతున్నారు. అడ్డదారులు తొక్కి డిపార్ట్‌మెంట్ పరువు తీస్తున్నారు. తాజాగా ఓమహిళలతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న ఆరోపణలతో సిఐని అరెస్ట్ చేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ నగరంలోని సిసిఎస్‌లో సిఐగా విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజు వనస్థలిపురంలోని సాయిగార్డెన్‌లో నివాసం ఉంటున్నాడు. ఆయన ఇటీవల మునుగోడు ఎన్నికల విధుల్లో ఉన్నారు. ఈనేపథ్యంలో గురువారం అర్థరాత్రి దాటిన తర్వాత సాగర్‌హైవే సమీపంలోని సాగర్ కాంప్లెక్స్ రోడ్డుపై ఓ మహిళతో ఏకాంతంగా గడుపుతున్నాడు. దీంతో ఇన్‌స్పెక్టర్ భార్య ఇచ్చిన ఫిర్యాదుతో ఘటనా స్థలికి వెళ్ళిన పోలీసులు సిఐతోపాటు మహిళను పట్టుకున్నారు. అనంతరం భార్య,



హోంగార్డు ఇచ్చిన ఫిర్యాదుతో సిఐ రాజును వనస్థలిపురం పిఎస్‌కు తరలించారు. ఇటీవల మారేడ్‌పల్లి సిఐ, మల్కాజ్‌గిరి సిసిఎస్ ఎస్సై, ఉదంతాలు బయటపడినా వివిధ పోలీస్ స్టేషన్లలోని అఫీసర్లపై ఈతరహా ఆరోపణలు వినిపిస్తున్నాయి. నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే నేరస్తులుగా మారుతుండటంతో సర్వత్రా ఆందోళన కలిగిస్తుంది.

**ఇతర వివాదాల్లోనూ..** క్రమశిక్షణతో కూడిన ఉద్యోగం, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించడం, ప్రజల రక్షణ కోసం ప్రాణాలు అర్పించడం పోలీసుశాఖ ప్రధాన విధి. కానీ కొందరు అధికారుల తీరు ఆశాఖకే మచ్చగా మారింది. కొందరు ఎస్సైలు, సిఐలు సివిల్ వివాదాల్లో తలదూర్చుతూ, అక్రమ దందాలను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు ఎప్పటినుంచో ఉన్నాయి. నిందితులు, బాధితుల నుంచి వసూళ్లు చేస్తున్న ఘటనలు తరచూ బయట పడుతున్నాయి. అక్రమంగా డబ్బులు తీసుకుంటూ ఏసిబికి చిక్కడం, ఇతర ఆరోపణలతో సస్పెన్షన్లకు గురికావడం సర్వసాధారణంగా మారింది.

# త్వరలో గాంధీ ఆస్పత్రిలో డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ

## 14.56 కోట్లతో మెరుగైన పారిశుద్ధ్య వ్యవస్థ ఏర్పాటు




సికింద్రాబాద్, నవంబర్ 4 ప్రభాతవార్త : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడమే కాకుండా కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా పరిశుభ్రతను పాటిం చేందుకు తగిన ఏర్పాట్లు జరుపుతున్నారు. ఇందు కోసం ప్రత్యేక నిధులు కేటాయించారు. ఈ నిధులు గతంలోనే మంజూరైనా తాజాగా వాటిని వినియోగించి గాంధీఆస్పత్రిలో పారిశుద్ధ్య వ్యవస్థను మెరుగుపర్చడం కోసం తగిన చర్యలు తీసుకుంటున్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ రోగులు, వారి సహాయకులు కొన్ని వార్డులలో అపరిశుభ్రత కారణంగా ఇబ్బం దులు పడుతున్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా వచ్చే రోగులతో పాటు సంపన్న వర్గాలు కూడా ఇప్పుడు గాంధీఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. హరిష్‌రావు మంత్రిగా వచ్చాక గాంధీఆస్పత్రిలో అత్యాధునిక వైద్య పరికరాలు, మిషన్‌లు ఏర్పాటు అవుతున్నాయి. కార్పొరేట్ ఆస్పత్రులలో కూడా సాధ్యం కాని కేసులు గాంధీఆస్పత్రిలో చికిత్స జరిపి జీవంపోస్తున్నారు. ఇలాంటి తరుణంలో గాంధీఆస్పత్రిలోని కొన్ని వార్డులలో అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థ కారణంగా ఆస్పత్రి అప్రతిష్టపాలవుతోంది. తాజాగా నిధులు మంజూరు కావడంతో డ్రైనేజీ, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కారం కానున్నాయి.

**అత్యాధునిక సదుపాయాలతో వైద్య సేవలు**

**గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజారావు**



అత్యాధునిక వైద్య సదుపాయాలతో ఇప్పటికే గాంధీఆస్పత్రి అద్భుతమైన వైద్య సేవలు అందిస్తోంది. ఇక్కడి వైద్యులు కూడా ప్రతిరోగిని ప్రతిష్టాత్మకంగా తీసుకొని వైద్యం చేస్తున్నారు. ఇప్పటి వరకు ఆధునిక వైద్య పరికరాలు సమకూర్చుకోవడంలో నిమగ్నమైన మేము ఇప్పుడు గాంధీ ఆస్పత్రి డ్రైనేజీ, పారిశుధ్యంపై దృష్టి సారిస్తున్నాము. మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుంటాము.

**పారిశుద్ధ్య వ్యవస్థకోసం ప్రత్యేక నిధులు**

సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో పారిశుద్ధ్య వ్యవస్థఅధునీకరణ కోసం నిధులను కేటాయింపు జరిగింది. గాంధీ ఆస్పత్రిలో అవసరమైన మేరకు పారిశుద్ధ్య వ్యవస్థను సంపూర్ణంగా అధునీకరించనున్నారు. ఇందుకోసం రూ. 14.56కోట్లు మంజూరయ్యాయి. ఇందులో రూ. 11.94 కోట్లు వెచ్చింది గాంధీ ఆస్పత్రిలోని ఎనిమిది అంతస్తులలో డ్రైనేజి వ్యవస్థను సమూలంగా మరమ్మతులు, నూతనంగా ఏర్పాటు చేయడం జరుపుతారు. ఆటో మోషన్ ఆండ్ ప్రొటెక్టివ్ మెజర్స్ కోసం రూ. 4.65కోట్లు, ఎక్స్ టర్నల్ సివరేజికోసం పైప్‌లైన్ కోసం రూ. 95లక్షలు, ఎక్స్‌టర్నల్ శానిటేషన్ కోసం రూ. 1.33కోట్లు, వరదనీటి పైప్‌లైన్ కోసం రూ. 13లక్షలు, బిల్డింగ్ ఇంటర్నల్ శానిటేషన్ కోసం రూ. 4.88 కోట్లు కేటాయిస్తున్నారు. మిగిలిన నిధులు ఇతర చార్జిలకోసం వినియోగిస్తారు. ప్రస్తుతం వర్షంకురిస్తే సెల్లార్‌తో పాటు కొన్ని వార్డులు ఇబ్బందిపడక తప్పని పరిస్థితి. సివరేజి వ్యవస్థను అధునీకరించడంవల్ల నీరు నిలువుండకుండా సాఫీగా వెళ్లే అవకాశం ఉంటుంది. దీంతో దుర్వాసన కూడా వ్యాపించే అవకాశం ఉండదు.

# నవమాసాలు నిండకుండానే..!

**ఇంటా.. బయట గర్భిణులపై ఒత్తిడి**

**పనిభారంతో సతమతం**

**గర్భస్థ శిశువుపై ప్రభావం**

**నెలలు నిండకుండానే పుడుతున్న వైనం**



హైదరాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త : నవ మాసాలు మోయకుండానే తక్కువ బరువు, నెలలు నిండకుండా పిల్లలు పుట్టి పురిటిలో కన్నుమూస్తున్నారు. ముఖ్యంగా గర్భస్థ శిశువు ఎదుగుదలకు ఒత్తిడి కీలకంగా మారుతుంది. ఆ ఒత్తిడి అనేక రుగ్మతలకు దారితీసి బిడ్డ పుట్టకనే శాపంగా మారుతుంది. ఆఫీసు, ఇంట్లో ఒత్తిళ్ళతో సతమతమయ్యే కొందరు గర్భిణులు పుట్టబోయే బిడ్డలపై శ్రద్ధ చూపడంలేదని వైద్య నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గర్భిణులకు ఒత్తిడితో పాటు మధుమేహం, బీపీ వంటి సమస్యలు తోడైతే అది మరింత ప్రమాదకరంగా మారుతుంది. వారు తీవ్రమైన ఒత్తిళ్ళకు గురైతే ప్రెగ్నెన్సీ ఇండ్యూస్ట్ హైపర్‌టెన్షన్‌కు దారి తీస్తుంది. హైపర్‌టెన్షన్ వల్ల రక్తప్రసరణలో అటంకాలు ఏర్పడి బిడ్డ ఎదుగుదల నిలిచిపోతుంది. కొందరికి బీపీ వల్ల ఫిట్స్ రావడం, వాంతులు కావడం వల్ల శిశువు పెరుగుదల సరిగ్గా ఉండదు. సాధరణంగా 37 వారాల తరువాత జన్మించే శిశువులను పూర్తిగా నెలలు నిండిన శిశువుగా వైద్యులు భావిస్తారు. ఎక్కువగా 37 నుండి 40 వారాలలోపు శిశువు జన్మిస్తారు. 24 నుండి 36 వారాల మధ్య జన్మించే శిశువుకు త్వరగా చికిత్స అందించి ఆరోగ్యవంతులను చేయవచ్చు.

**ఇలా ఉంటే..** కొంతమంది మహిళలకు గర్భిణి సమయంలో మధుమేహం ఎక్కువగా ఉంటోంది. ప్రసవం తరువాత ఇది కనిపించదు. గర్భిణుల్లో మధుమేహం తీవ్ర స్థాయిలో ఉంటే అది బిడ్డ ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. థైరాయిడ్, హైపర్‌టెన్షన్, యూరిన్ ఇన్‌ఫెక్షన్, ఎజైనల్ ఇన్‌ఫెక్షన్ వల్ల ప్రీమెచ్యూర్ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. తక్కువ వయస్సు ఆలస్యంగా వివాహాలు చేసుకుంటే నెలలు పూర్తి కాకుండా తక్కువ బరువుతో పిల్లలు పుట్టే ప్రమాదం ఉంది. 20ఏళ్ళ లోపు 30 నుంచి 35 ఏళ్ళు దాటిన తరువాత పిల్లల ప్రసవం విషయంలో కాస్త ఆలోచించాలి. గర్భిణికి రక్తహీనత ఉంటే కూడా పిల్లల్లో ఎదుగుదల తగ్గిపోయే అవకాశముంది. ధూమపానం, మద్యపానం అలవాటు ఉండే మహిళలకు పట్టబోయే బిడ్డ ఎదుగుదల, బరువుపై ప్రభావం పడే అవకాశముంది. రక్తస్రావం (బ్లీడింగ్) ఎక్కువగా జరిగే గర్భిణులకు తక్కువ బరువుతో బిడ్డ పుట్టే ప్రమాదముంది. ఇన్‌ఫెక్షన్ వంటి వాటితో కూడా బిడ్డ బరువు తక్కువగా ఉండడం, నెలలు నిండకుండా పుట్టే అవకాశముంటుంది. ఆధునిక వైద్య చికిత్సలు, నైపుణ్యం గల వైద్యుత చికిత్సలతో ప్రీమెచ్యూర్ బేబీలలో 70శాతం మందిని బతికించడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో ఎక్కువగా ఇబ్బందులు ఉంటాయి. 24 వారాల సమయంలో పుట్టిన 20 నుంచి 30 శాతం, 30 వారాల నుంచి పై బడిన వారిలో 80శాతం నుంచి 90శాతం పిల్లలను బతికించే అవకాశాలు ఉంటాయి.

**ఇలా అయితే..** 34వారాలు దాటిన తరువాత జన్మించే శిశువులు 1.82 కిలోల బరువు ఉంటే ప్రమాదం ఉండదు. వారిలో శ్వాసకోశ సంబంధిత సమస్యలు, ఇతర జబ్బులు లేకపోతే ఇబ్బంది ఉండదు. 32 నుంచి 34 వారాల లోపు శిశువులు కిలో కంటే తక్కువ బరువు ఉంటే ప్రత్యేక చికిత్స అందించాలి. 28 నుంచి 32 వారాల లోపు పుట్టే పిల్లలకు నవజాత శిశువు వార్డుల్లో చికిత్స అందించాలి. 25 నుంచి 32 వారాల లోపు పుట్టిన పిల్లలకు అన్ని సదుపాయాలు ఉన్న వార్డుల్లో చేర్పించి మెరుగైన వైద్యం అందిస్తే వారి ప్రాణాలను కాపాడవచ్చు. 500 గ్రాములతో పుట్టిన శిశువులకు చికిత్స అందించి వారి బరువు పెంచే ఆధునిక సదుపాయాలు ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి.

**ప్రీమెచ్చూర్ నివారణకు..** ప్రీమెచ్యూర్ అని తెలియగానే ప్రసవానికి ముందే గర్భిణీని అసుపత్రిలో చేర్పించి వైద్యుల పర్యవేక్షణలో ఉంచాలి. ముందు నుంచే మెరుగైన మెడికేషన్ చేయడం వల్ల పిల్లలకు మున్ముందు వచ్చే ఇతర ఇబ్బందులను అదిగమించవచ్చు. 26 వారాలకే ఉమ్మనీరు పోతుంటే ఆసుపత్రిలో ఆడ్మిట్ చేసి, మెరుగైన చికిత్స ద్వారా త్వరగా ప్రసవాన్ని నివారించి ప్రీమెచ్యూర్ జరగకుండా చూడొచ్చు. ప్రీమెర్యూర్ బేబీ పుట్టిన మొదటి నిమిషం నుంచి వైద్యులు చికిత్సలు అందించాలి. టెంపరేచర్, శ్వాస సమస్య, గుండె పనితీరును నిరంతరం పర్యవేక్షించాలి. ఊపిరితిత్తులు, కాలేయం, మూత్ర పిండాలు, పేగులు సున్నితంగా ఉంటాయి. మెదడు, రక్తనాళాలు సన్నగా ఉంటాయి. దీనికి తోడు పుట్టగానే పిల్లలు ఈ వాతావరణానికి అలవాటు పడలేరు. వారిలో ఊపిరితిత్తులు, గుండె తదితర అవయవాలు తయారైనప్పటికీ పనితీరు అంతగా ఉండదు. ఆఖరి వారంలోనే గర్భంలోని శిశువు అభివృద్ధి ఎక్కువగా జరుగుతుంది. 30 నుంచి 40 వారాలలో పిల్లలు ఎదుగుదల బాగా ఉంటుంది. ప్రీమెచ్యూర్ బీబే 1.5 కిలోల కంటే తక్కువ బరువు ఉన్నా, శ్వాస ఇబ్బందులు ఉన్నా ఇంక్యుబేటర్‌లో పెట్టి చికిత్స అందించాలి. కొంతమందికి వార్మర్‌లో చికిత్సలు అందించాలి. ఇన్‌ఫెక్షన్ రాకుండా యాంటిబయాటిక్, బ్లడ్ పరీక్షలు, గుండె పనితీరు, ఆక్సిజన్ సాచ్యురేషన్, మూత్ర విసర్జనను పరిశీలించాల్సి ఉంటుంది. బ్రెయిన్ స్కాన్ వంటివి చేయాల్సి ఉంటుంది. ప్రీమెచ్చూర్ బేబీకి తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలి. దీని వల్ల క్రమంగా బరువు పెరుగుతారు.

## సోదరుడి మరణాన్ని తట్టుకోలేక ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న శ్యామ్‌సుధాకర్ రెడ్డి (ఫైల్)

పేట్‌బషీరాబాద్, నవంబర్ 4 ప్రభాతవార్త: తీవ్ర మనోవేదనతో భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. దూలపల్లి నాగార్జున డ్రీమ్‌లాండ్ అపార్ట్‌మెం ట్‌లో నివాసం ఉంటున్న రఘుపతిరెడ్డి కుమారుడు శ్యామ్ సుధాకర్ రెడ్డి(27) తన సోదరుడు రెండు సంవత్సరాల క్రితం హార్ట్‌స్ట్రోక్‌తో చనిపోయాడు. అయితే తన సోదరుడి మరణాన్ని జీర్ణించుకోలేక తీవ్రమనోవేదనకు గురై శుక్రవారం భవనం 5వ అంతస్తుపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ మేరకు తండ్రి రఘుపతిరెడ్డి పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

**రోడ్డుపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులకు గాయాలు**



అదుపు తప్పి లారీని ఢీకొట్టిన కారు

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబర్ 4 ప్రభాతవార్త : 4వతేదీ శుక్రవారం సాయంత్రం 6.00 గంటలకు ఫిర్యాదు దారుడు పిన్ని బ్రహ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు 3వ తేదీ గురువారం తన బావమరిది అంజయ్య అతని కుటుంబ సభ్యులతో కలిసి తన యొక్క కారు టిఎస్ 07 హెచ్‌ఎన్ 6391లో ఒంగోలు నుండి హైదరాబాద్ లోని బిఎన్‌రెడ్డినగర్‌కి వెళ్తుండగా, మార్గ మధ్యలో ఎన్‌హెచ్ 65 ఔటర్ రింగురోడ్డు పెద్ద అంబర్ పేట వద్దకు చేరుకునే సమయానికి ఒడి 05 ఎక్స్ 6544 నెంబర్ గల లారీ డ్రైవర్ తన లారీనీ నిర్లక్ష్యంగా ఎలాంటి సూచనలు లేకుండా రోడ్డు పక్కన పార్క్ చేసారు. హైదరాబాద్‌వైపు వస్తున్న కారు అదుపు తప్పి లారీనీ వెనకనుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ప్రయాణిస్తున్న అంజయ్య, వీరనారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను సమీపంలోని హాస్పిటల్‌కి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## ఇంటి నుంచి వెళ్లిన పదో తరగతి విద్యార్థి అదృశ్యం



లింగంపల్లి ప్రణవ్‌కుమార్

ఉప్పల్, నవంబరు 4 ప్రభాతవార్త : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఒక పదో తరగతి విద్యార్థి అదృశ్యమైన సంఘటన ఉప్పల్ పోలీ స్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివ రాల ప్రకారం.. ఉప్పల్ విజయపురికాలనీకి చెందిన లింగంపల్లి అనిల్‌కుమార్ కుమారుడు ప్రణవ్‌కుమార్ 14 సెయింట్ జాన్స్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాడు. అయితే ఈనెల 1వ తేది న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బందువులు చుట్టు పక్కల గాలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు ఉప్పల్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పెరిగిన చలి.. జోరుగా స్వెట్టర్ల అమ్మకాలు



చార్మినార్, నవంబరు 4 ప్రభాతవార్త : శీతల గాలులతో నగరవాసులు గజగజ వణికిపోతున్నారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. దీంతో చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఉన్ని దుస్తుల వైపు చూస్తున్నారు. పాతబస్తీలోని పలు షాపులలలో శీత కాలం సందర్భంగా స్వెట్టర్లు,దుప్పట్ల అమ్మకాలు జరుగుతున్నాయి.చలి కాలం ప్రారంభం అవ్వటంతో ప్రజలు శరీర రక్షణ కోసం వెచ్చగా ఉండే స్వెట్టర్లు, టోపీలు, దుప్పట్లను కొనుగోలు చేస్తున్నారు. చలి రోజు, రోజుకు పెరుతుండటంతో చలి నుంచి కాపాడు కోవటానికి ప్రజలు స్వెట్టర్లు ఖరీదు చేస్తుండటంతో షాపులు రద్దీగా ఉంటున్నాయి. మహ్మద్ క్యాప్ మార్ట్‌తో పాటు పలు షాపులలో వివిధ రకాల స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు, మఫ్లేర్లు, చేతుల గౌజ్లు, టోపీలను అమ్ముతున్నారు. కాగా ప్రతీ ఆదివారం పాతబస్తీలో జరుగుతున్న సండే బజార్‌లో కూడ చలి కాలానికి సంబంధించిన వివిధ రకాల వస్త్రాలను విక్రయిస్తున్నారు.

## పుప్పాలగూడలో ఈ నెల 8నుంచి 11వరకు రెజ్లింగ్ పోటీలు



పుప్పాలగూడ శివాలయం వద్ద జరిగిన సమావేశంలో సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రెస్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల వివరాలు తెలుపుతున్న ప్రతినిధులు

నార్సింగి, నవంబర్ 4 ప్రభాతవార్త : మణికొండలోని పుప్పాలగూడ శివాలయం వద్ద ఈ నెల 8.వ,తేదీ నుంచి 11.వ,తేదీ వరకు తెలంగాణ కేసరి టైటిల్ రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నామని రంగారెడ్డి జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు యాదయ్య, చైర్మన్ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం పుప్పాలగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు సీనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్-2022 పోటీల వివరాలను వెల్లడించారు. ఈ పోటీలలో పురుషులు, మహిళలు కూడా పాల్గొనవచ్చని తెలిపారు. 55.కేజీల నుంచి 90.కేజీల పహిల్వాన్ల ఓపెన్ చాలెంజ్, టైటిల్ వెయిట్ పోటీలలో తలపడవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో రెజ్లింగ్ ఇంటర్‌నేషనల్ కోచ్ కృష్ణ ముదిరాజ్, మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## లారీ డ్రైవర్ సమయస్ఫూర్తితో.. స్కూల్ బస్సుకు తప్పిన పెను ప్రమాదం

**లారీ, స్కూల్ బస్సు ఢీకొని ముగ్గిరికి స్వల్పగాయాలు**

**బాధితులను పరామర్శించిన దుండిగల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్**





గాయపడిన వారిని పరామర్శిస్తున్న చైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ, లారీని ఢీకొన్న స్కూల్ బస్సు

దుండిగల్, నవంబర్ 4 ప్రభాతవార్త : లారీ డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో స్కూల్ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. గ్రానైట్ బండల లోడ్‌తో వస్తున్న లారీ, స్కూల్ బస్సు ఢీకొన్న సంఘటనలో ఓ విద్యార్థితో పాటు మరో ఇద్దరికి స్వల్పగాయాలైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేటలోని ద క్రీక్ స్కూల్ బస్సు(టిఎస్08యూఏ2478) విద్యార్థులతో శుక్రవారం ఉదయం 7:30గంల ప్రాంతంలో గండిమైసమ్మ చౌరస్తా నుండి సూరారం వైపు వెళ్తుంది. అదే సమయంలో గండిమైసమ్మ నుండి సూరారం వైపు గ్రానైట్ రాళ్ళ లోడ్‌తో ఉన్న లారీ (ఎపి31టిహెచ్5160)సైతం వెళ్తుంది. అయితే శ్రీరామ్‌నగర్‌కాలనీ సమీపానికి చేరుకోగానే స్కూల్ బస్సు డ్రైవర్ ఆకస్మాత్తుగా యూటర్న్ తీసుకునే ప్రయత్నం చేశాడు. దీంతో పక్క నుండి వెళ్తున్న లారీ డ్రైవర్ ప్రమాదాన్ని పసిగట్టి ఆకస్మాత్తుగా లారీని కుడివైపుకు మళ్ళించడంతో రోడ్డు పక్కన నిలిపి ఉన్న మరో లారీని ఢీకొట్టి నిలిచిపోయింది. అయితే అప్పటికే స్కూల్‌బస్సు ఒకవైపు లారీని ఢీకొంది. ఈప్రమాదంలో స్కూల్ బస్సులో ప్రయాణిస్తున్న ఓ విద్యార్థితో పాటు వృద్ధుడు, ఓ విద్యార్థి తల్లికి స్వల్పగాయాలైయ్యాయి. గాయపడిన వారిని స్థానికంగా ఉన్న ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో 20మంది విద్యార్థులున్నట్లు పేర్కొంటున్నారు. లారీ డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించకపోతే పెను ప్రమాదం జరిగేదని స్థానికులు అంటున్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ, కమీషనర్ భోగీశ్వర్లు, వైస్‌చైర్మన్ తుడుము పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, భరత్‌కుమార్ తదితరులు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి వారికి అండగా ఉంటామన్నారు.

**ఆందోళనకు దిగిన స్థానికులు..** స్కూల్ బస్సు, లారీ ఢీకొన్న ఘటనపై స్థానికులు మండిపడుతూ ఆందోళనకు దిగారు. డివైడర్ చివర ఎటువంటి సూచికలు లేకపోవడం, సమయపాలన లేకుండా భారీవాహనాలు రాకపోకలు కొనసాగించడం ఏమిటని ప్రశ్నించడంతో పాటు కొందరూ ట్రాఫిక్ సిబ్బంది మాముళ్ళకు అలవాటు పడడంతోనే సమయపాలన లేకుండా భారీవాహనాల రాకపోకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ రోడ్డుపై భైఠాయించడంతో ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో లాఅండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు, మున్సిపల్ అధికా రులు వారికి నచ్చజెప్పారు. మరోసారి ఇటు వంటి ఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని హామినివ్వడంతో ఆందోళన విరమించారు. అదేవిధంగా తమ సిబ్బంది ఎవరైనా నిబంధనలకు విరుద్ధం గా పని చేస్తున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావస్తే విచారణ జరిపి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## ఎస్.ఐ కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

**తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నీల వెంకటేష్**



ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న నీల వెంకటేష్

ధర్నాచౌక్, నవంబర్ 4, ప్రభాతవార్త: ఇటీవల జరిగిన ఎస్.ఐ., కానిస్టేబుల్ రాత పరీక్షలో జరిగిన అవకతవకలపై తక్షణమే విచారణ జరిపించాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ ఛైర్మన్ నీల వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఐ, కానిస్టేబుల్ రాత పరీక్ష రాసిన అభ్యర్థులతో కలసి ఇందిరాపార్కు వద్ద ఆయన సమావేశం అయ్యి, రాతపరీక్ష లో జరిగిన అవకతవకలపై చర్చిస్తూ ఉండగా ఒక్కసారిగా పోలీసులు మోహరించారు. అనుమతి లేకుండా నిరసన చేపట్టారంటూ పోలీసులు వారిని వాహనాలలో ఎక్కించి, గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శాంతియుతంగా చర్చిస్తున్న తమని అరెస్ట్ చేయటం పట్ల వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నీల వెంకటేష్ మాట్లాడుతూ ఇటీవల ఏడు లక్షల మంది ఎస్.ఐ., కానిస్టేబుల్ అభ్యర్థులు రాసిన ప్రిలిమ్స్ ఫలితాలు ప్రకటించారు, కానీ అందులో జరిగిన అవకతవకల కారణంగా 31శాతం మంది మాత్రమే ఫలితాలు సాధించారని అన్నారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అభ్యర్థులకు కూడా కటాఫన మార్కులు 50 కి తగ్గించాలని, ప్రతి ఒక్క అభ్యర్థి మార్కుల లిసన్ట రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, ప్రజాపతి, భాస్కర్, బీసీ యోజన సంఘం రాష్ట్ర నాయకులు మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు కావడం లేదు




సమావేశంలో మాట్లాడుతున్న ఓ మహిళ

చిక్కడపల్లి నవంబరు 4 ప్రభాతవార్త: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు, ఇతర కార్మికచట్టాలు అమలు కావడం లేదని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇది చాలా అన్యాయమని అన్నారు. అఖిలభారత మిడ్డేమీల్ వర్కర్స్ ఫెడరేషన్(సిఐటియు అనుబంధం) 2త జాతీయమహాసభలు శుక్రవారం బాగ్‌లిం గంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఫెడరేషన్ జాతీయ అధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి జాతీయ పతాకావిష్కరణతో ప్రారంభమయ్యాయి. సభకు ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి జై భగవాన్ అధ్యక్షత వహించగా ఆహ్వానసంఘం ఛైర్మన్ అలుగుబెల్లి నర్సిరెడ్డి అధ్యక్షోపన్యాసం చేశారు. ముఖ్యఅతిథిగా సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి ఎ.ఆర్.సింధు పాల్గొనగా ఫెడరేషన్ జాతీయ అధ్యక్షురాలు ఎస్.వరలక్ష్మి, ఆహ్వానసంఘం వైస్‌ఛైర్మన్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు చుక్కరాములు, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆహ్వానసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ.రమ తదితరులు ప్రసంగించారు. సిఐటియు జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.సాయిబాబు, రాష్ట్రప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జంగయ్య, చావరవి, ఆంగన్‌వాడీ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు ఉష, ఆషా వర్కర్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సురేఖ, మిడ్డేమీల్ ఫెడరేషన్ జాతీయ నేత స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

## హుస్సేన్ సాగర్ జలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బేగంపేట, నవంబరు 4,ప్రభాతవార్త : హుస్సేన్ సాగర్ జలాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు ఈ సమాచారాన్ని రాంగోపాల్‌పేట పోలీసులకు తెలియజేసారు.వెంటనే పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సబ్ ఇన్స్‌పెక్టర్ అడ్మిన్ రాజు రాథోడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.ఈ నెల 3వ తేదీన పెట్రోలింగ్ విధులలో ఉన్న కానిస్టేబుల్ ఎన్.నవీన్ కుమార్ కు గం 11.30నిల సమయంలో హుస్సేన్ సాగర్ లో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నాడన్న సమాచారం తెలియజేస్తూ ఫోన్ వచ్చింది.వెంటనే అక్కడికి చేరుకుని పరిశీలించగా అతను నన్నయ్య విగ్రహం,అంబేద్కర్ కమాన్ వద్ద సాగర్ జలాల్లో మృతి చెంది ఉన్నట్లు గుర్తించారు.వెంటనే ఈత గాడు చక్రి సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. సమీపంలో విచారించగా అతను ఎవరో తెలియదని సమాచారం రావడంతో గుర్తు తెలియని వ్యక్తి ఆచూకి కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.మృతుని వయస్సుసుమారు 35నుంచి40 సంవత్సరాల వరకు ఉంటుందని,ఎత్తు 5.8అడుగులు ఉంటాడని,కళ్ళు,నోరు మూసుకుని ఉన్నాడన్నారు.వంటిపై నలుపు రంగు చొక్కా,నలుపు రంగు ట్రాక్ ఫ్యాంటు(నైక్)కుడి చేతికి నలుపు రంగు రిస్టు ఉందని,మృతుని ఆచూకి తెల్సిన వారు సమాచారం కోసం రాంగోపాల్‌పేట పోలీసు స్టేషన్ లో సంప్రదించాలని ఎస్సై రాజు తెలిపారు.

## మహదేవ్ మందిరంలో అన్నకూట్ మహోత్సవం



శివ మందిరంలోని స్పటిక శివ లింగం

చార్మినార్,నవంబరు 4 ప్రభాతవార్త : కార్తీక మాసం సందర్బంగా ఈ నెల 7వ తేదీ సోమవారం రోజున చార్మినార్ శ్రీ మహదేవ్ మందిరంలో చార్‌కమాన్ జెవెల్లర్స్ అండ్ షరాఫా అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించను న్నామని మందిరం కమిటి ప్రతినిధులు అజయ్ కుమార్ అగర్వాల్ తెలిపారు.పూజలు అనంతరం సోమవారం రాత్రిఏడున్నర గంటలకు అన్నకూట్ మహోత్సవం ప్రారంభం అవుతుందని,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించాలని ఆయన కోరారు.ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ శ్రీ మహదేవ్ మందిరంలో కార్తిక మాసం సందర్బంగా ప్రతీ రోజు పూజలు జరుగుతున్నాయని అజయ్ కుమార్ అగర్వాల్ తెలియజేశారు.

## కాల్షియం కార్బైడ్‌ను పట్టుకున్న పోలీసులు

**దాదాపు నలభై లక్షల విలువైన రసాయన నిల్వలు స్వాధీనం**



కాల్షియం కార్బైడ్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ధర్నాచౌక్, నవంబర్ 4, ప్రభాతవార్త: అక్రమంగా డ్రమ్ములలో నిల్వ ఉంచిన కాల్షియం కార్బైడ్‌ను ముషీరాబాద్ పోలీసులు శుక్రవారం పట్టుకుని, స్వాధీనం చేసుకున్నారు. ముషీరాబాద్ ఎస్‌హెచ్ఓ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల ఇంద్రా నగర్‌లో ఇసాక్ క్లింటన్ (31), జోషువా కాలెబ్ (34) అనే ఇద్దరు వ్యక్తులు కాల్షియం కార్బైడ్‌ను వారి గోడౌన్‌లో నిల్వ ఉంచారనే సమాచారం మేరకు ముషీరాబాద్ పోలీసులు ఆ గోడౌన్‌పై దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో దాదాపు ఐదు వందల డ్రమ్ములు కాల్షియం కార్బైడ్‌తో నిండి ఉండటాన్ని గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకుని, యజమానులైన ఇసాక్, జోషువా లపై కేసు నమోదు చేశారు. ఒక్కో డ్రమ్ములో 50 కిలోలు, 100 కిలోలు కార్బైడ్ నిల్వ ఉంచారని, దాని మొత్తం విలువ దాదాపు 40 లక్షల వరకు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. చట్టవిరుద్ధంగా నివాసాల మధ్యలో ప్రమాదకరమైన ఈ కార్బైడ్‌ను నిల్వచేసినందుకు వారిపై కేసు నమోదు చేశామని, ఈ నిల్వలను సీజ్ చేసి, శాంపిల్‌ను ఎఫ్ఎస్ఎల్‌కు పంపించి, రిపోర్ట్ వచ్చిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని జహంగీర్ యాదవ్ వివరించారు.

## ఉద్యమనేతకు నివాళులు



నివాళులు అర్పిస్తున్న వి.శ్రీనివాస్‌రెడ్డి

చిక్కడపల్లి, నవంబరు 4 ప్రభాతవార్త: తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన ఉద్యమ నాయకుడు, టిఆర్ఎస్ సీనియర్ నేత నందికంటి నర్సింగరావు మృతదేహాన్ని టిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నర్సింగరావు కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నేత సిరిగిరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 'లక్ష పుష్పార్చన'

చిక్కడపల్లి, నవంబరు 4 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్ లోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో 'లక్ష పుష్పార్చన' కార్యక్రమాన్ని శనివారం ఉదయం నిర్వహించబోతున్నట్లు ఆలయం బ్రాంచ్ హెడ్ కళావిఎస్.జనార్ధనమూర్తి వివరించారు. శృంగేరి జగద్గురు శ్రీభారతీతీర్థ మహాస్వామి, విదుశేఖర భారతీ స్వామివారి దివ్య ఆశీస్సులతో నిర్వహిస్తున్న ఈ ఆలయంలో జరిగే ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## 21వ డివిజన్ సాయినగర్‌లో ఫించన్ల పంపిణీ



ఫించన్లను అందజేస్తున్న కార్పొరేటర్ కాసాని శిరీష

నిజాంపేట్, నవంబర్4 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 21వ డివిజన్ ప్రజలు ఆసరా ఫించన్లను తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నామని శుక్రవారం కార్పొరేటర్ కాసాని శిరీషకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ అధికారులతో మాట్లాడి 21వ డివిజన్ సాయినగర్ బస్టాప్ వద్ద ఫించన్లను తీసుకునే విధంగా ఏర్పాటు చేశారు. తమ ఇబ్బందులను గుర్తించి సులువుగా ఫించన్లను తీసుకునే విధంగా కృషి చేసిన కార్పొరేటర్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్, నవంబరు 4 ప్రభాతవార్త : విద్యుత్ మరమ్మతులు కారణంగా ఈ నెల 4వ తేదీ శనివారం ఉదయం 10 నుంచి 11.30 గంటలు వరకు కాజానగర్,ఖాజా పహాడి,బిఎన్‌కె కాలనీ ఈద్గా,తాడ్‌బన్, నిజాం కాలనీ ప్రాంతాలలో,11 నుంచి 1 గంట వరకు వీకర్ సెక్షన్ కాలనీ,అత్తాపూర్,రాంబాగ్,సాగర్ ఎర్త్ మోర్,తేజస్వీనగర్ కాలనీ బస్తీలలో 12నుంచి 1 వరకు అన్సారీరోడ్డు,దానిమ్మ గుడిసెలు,ఓవైసీ హిల్స్ ప్రాంతాలలో,3 నుంచి 4.30 గంటలు వరకు గౌస్‌నగర్,నవాబ్ సాహెబ్‌కుంట,సాలెహిన్ కాలనీ,సంజయ్ గాంధీ నగర్,రెహ్మాత్ నగర్ తదితర బస్తీలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఫలక్‌నుమా సిబిడి ఎడిఇ మధుసూధన్‌రెడ్డి తెలిపారు.

## 6న 'బ్రాహ్మణ చైతన్య సదస్సు'

**చకిలం సుధాకర్ పిలుపు**

సైఫాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త: బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీ ఆదివారం మల్లాపూర్, నాచారంలోని విఎన్ఆర్ గార్డెన్స్ లో 'బ్రాహ్మణ చైతన్య సదస్సు' (కార్తీక వనసమారాధన) నిర్వహిస్తున్నామని సమాఖ్య తెలిపింది. ఉదయం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు, శ్రీమహాగణపతిపూజ, శివాభిషేకంతోపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు (నందికేశుని నోములు, కైలాసగౌరి నోములు లక్ష పసుపు కొమ్ముల నోములు) కొనసాగుతాయని తొమ్మిదన్నర గంటలకు సమాఖ్య కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో బ్రాహ్మణ చైతన్య సదస్సు జరుగుతుందని సమాఖ్య ఛైర్మన్ చక్కిలం సుధాకర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.ప్రభాకర్, కె.చంద్రశేఖర్ శుక్రవారం నాడిక్కడ పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మీయ అతిధులుగా శాసన సభ్యులు డి.శ్రీధర్‌బాబు, వాణిదేవి, కొన రఘుపతి, మల్లాది విష్ణు, మాజీ ఎమ్మెల్యే ఎస్‌విఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే ఎన్.రామచంద్రరావు, మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఐవిఆర్ కృష్ణారావు తదితరులు పాల్గొంటారని వారు వివరించారు. ఈ కార్యక్రమాల్లో బ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## సెకండ్ ఎఎన్ఎంలను తక్షణమే పర్మినెంట్ చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న ఎండి యూసఫ్

సైఫాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త: నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న 2వ ఎఎన్ఎంలను ఏలాంటి షరుతు లేకుండా తక్షణమే పర్మినెంట్ చేయాలని ఏఐటియుసి రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.డి.యూసఫ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అన్ని మిషన్‌లలో 2వ ఎఎన్ఎంలు పూర్తిస్థాయిలో పాల్గొని వాటిని విజయవంతం చేస్తున్నారని రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న ఎఎన్ఎంల జీవితాల్లో మాత్రం భారీ వ్యత్యాసం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటియుసి భవన్‌లో జరిగిన 2వ ఎఎన్ఎంల జిల్లా కో-ఆర్డినేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లో రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఎఎన్ఎంలు పర్మినెంట్ చేసేందుకు విడుదల చేసిన జివొ నెంబరు 16లో ఎఎన్ఎంలను ఎందుకు చేర్చలేదని ఆయన ప్రశ్నించారు. రాబోయే రోజుల్లోనైనా పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని యూసఫ్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎం.నర్సింహ, ఎన్‌హెచ్ఎం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామారాజేష్‌కన్నా, వర్కింగ్ ఉమెన్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ పి.ప్రేమ్‌పావని, అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సాయేశ్వరి, ఎటిసి నాయకులు తోట రామంజనేయులు, మహిళా సమాఖ్య నాయకురాలు నళిని, 2వ ఎఎన్ఎం యూనియన్ నాయకులు బడేటి వనజ, పడాల మమత, గాండ్ల మధురిమ, సిహెచ్ విజయకుమారి, మర్రి జ్యోతి పాల్గొన్నారు.

## విగ్రహా ప్రతిష్టాపనకు ఆహ్వానం



ఎమ్మెల్సీకి ఆహ్వానపత్రికను అందజేస్తున్న కమిటి సభ్యులు

దుండిగల్, నవంబర్ 4 ప్రభాతవార్త : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, ప్రగతినగర్‌కు చెందిన అల్లూరి విగ్రహా ప్రతిష్టాపన కమిటి సభ్యులు శుక్రవారం మేడ్చల్ జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఈనెల 6న నిర్వహించనున్న అల్లూరి సీతారామరాజు విగ్రహా విష్కరణకు హాజరుకావాలని కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో వేణుగోపాల్‌రాజు, సాయిరాజు, భాస్కర్‌రాజు, శ్రీనివాస్‌రాజు, కెవి.కృష్ణంరాజు, ప్రభాకర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లు, షాపులు నిర్ణీత సమయంలో మూసి వేయాలి

**ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య**

చార్మినార్,నవంబరు 4 ప్రభాతవార్త : పాతబస్తీలోని హోటళ్లు,బేకిరీలు,షాపులు రాత్రి వేళల్లో నిర్ణీత సమయంలో మూసి వేయాలని కాలాపత్తర్ సిఐ ఎన్.బుచ్చయ్య వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు.పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం పలు ప్రాంతాలకు చెందిన హోటళ్లు,బేకిరీలు,షాపుల యజమానులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్బంగా ఇన్‌స్పెక్టర్ బుచ్చయ్య మాట్లాడుతూ హోటళ్లు,బేకిరీలు,షాపులు నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలో మూసి వేయాలని,లేనిచో కేసులు నమోదు చేసి చట్ట పరమైనచర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.కాలాపత్తర్ పోలీస్ స్టేషన్ పరిది లోని పలు ప్రాంతాలకు చెందిన హోటళ్లు,బేకిరీల యజమానులు,షాపుల నిర్వహకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరితంగా పూర్తి చేయాలి : ఛైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ




అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఛైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ

దుండిగల్, నవంబర్ 4 ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధి 9వ వార్డులోని పలుకాలనీల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులకు శుక్రవారం ఛైర్‌పర్సన్ సుంకరి క్రిష్ణవేణిక్రిష్ణ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రాధన్యత క్రమంలో ఆయా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతామని, మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తోన్నట్లు పేర్కొన్నారు. అనంతరం మున్సిపల్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ పరిధికి చెందిన 24మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతోనే కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కమీషనర్ భోగీశ్వర్లు, తహసీల్దార్ పద్మప్రియ, వైస్‌ఛైర్మన్ తుడుము పద్మారావు, కౌన్సిలర్లు శంభీపూర్ క్రిష్ణ, బండారి మహేందర్‌యాదవ్, సాయియాదవ్, పిఎసిసి డైరెక్టర్ వెంకటేశ్‌యాదవ్, నాయకులు రాజశేఖర్‌యాదవ్, పోతారం మల్లేష్, కొల్తూరి మల్లేష్, కోలా రాము, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

**గాయపడిన విద్యార్థులను పరామర్శించిన ఛైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ..** దుండిగల్ మున్సిపాలిటీ, గండిమైసమ్మ శ్రీరామ్‌నగర్ వద్ద లారీ వేగంగా దూసుకువచ్చి స్కూల్‌బస్సును ఢీకొన్న ఘటనలో గాయపడిన మహిళతో పాటు విద్యార్థులను ఛైర్‌పర్సన్ క్రిష్ణవేణిక్రిష్ణ పరామర్శించారు. అనంతరం తన కార్యాలయంలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులతో సమావేశమైయ్యారు. ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమయం దాటిన తరువాత భారీ వాహనాలను ఎట్టి పరిస్థితుల్లో రాకపోకలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో లా అండ్ ఆర్డర్ సిఐ రమణారెడ్డి, ట్రాఫిక్ సిఐ చంద్రశేఖర్, కమీషనర్ భోగీశ్వర్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## యువతకు సాహిత్య కళాభిమానం ఎంతో అవసరం

**తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**




పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి, విహారి, మామిడిహరికృష్ణ, దైవజ్ఞశర్మ, బి.వెంకట్రావు, రఘుశ్రీ తదితర అతిథులు

రవీంద్రభారతి, నవంబరు 4 ప్రభాతవార్త : సాహిత్యం, కళలు మనోవికాసానికి, విజ్ఞానానికి, పరిజ్ఞానానికి, మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని, వీటిపట్ల యువతకు అభిరుచి, అభిమానం, అవగాహన, తెలుసుకోవాల్సిన, ఆచరణ, నడవడికలో రావాల్సిన మార్పు చైతన్యం ఎంతో అవసరమని, ముఖ్యంగా వారికోసమే తరచూ ఆయా కార్యక్రమాలను జరుపుకొంటున్నా ఇలాంటి కార్యక్రమాల్లో 90శాతానికిపైగా 45ఏళ్లకు పైబడిన వారు తప్ప యువత కనబడకపోవడం ఆందోళనకరమని ఆవేదన వ్యక్తపరిచిన తెలంగాణ ప్రభుత్వ సలహాదారు నేడు ఎన్నికల్లో ఓట్లు వేయడానికి అన్ని రాజకీయ పార్టీలు ఓటర్లను వేలల్లో డబ్బులిచ్చి పిలిపించు.. కొంటున్నట్లు కళా సాహిత్య సమావేశాలకు హాజరవ్వడానికి కూడా డబ్బులిచ్చి ప్రేక్షకుల్ని తెప్పించు.. కొనే దుస్థితి ఏర్పడుతుందేమోనని, ఇప్పుడున్న వ్యవస్థ లో ఎవ్వరికీ ఏమీ అక్కడరలేదు... ప్రతీవిషయం లోనూ నాకేంటి అనే పరిణామం నడుస్తోందని మనోవ్యధను వెలిబుచ్చారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో శ్రీమానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ సాహితీవేత్త డా. విహారి సభాధ్యక్షతన శుక్రవారం ఉదయం 'అఖిల భారత పశు(జంతు) ప్రదర్శన' హాస్య వ్యంగ్య కథానికల పుస్తకం ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. కె.వి.రమణాచారి విశిష్ట అతిథులు రాష్ట్ర భాషాసాంస్కృతికశాక సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, గౌరవ అతిథులు ప్రముఖ రచయితలు సింహప్రసాద్, కె.పి.అశోక్‌కుమార్, శ్రీమానస సంస్థ అధ్యక్ష కార్యదర్శులు బి.రామచంద్రరావు, రఘుశ్రీ తదితరులతో కలిసి ప్రముఖ రచయిత బాలం వెంకట్రావు రచించిన హాస్య వ్యంగ్య కథానికల పుస్తకం 'అఖిల భారత పశు(జంతు) ప్రదర్శన' పుస్తకాన్ని ఆవిష్కరించారు.




మాదాపూర్‌లోని హైటెక్స్‌లో గేమింగ్ ఫెస్టివల్‌లో గేమ్స్‌లోని పాత్రల ప్రదర్శన

## ఘనంగా గురుద్వార ప్రకాశ్ ఉత్సవ్ వేడుకలు

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న సిక్కులు**



సిక్కుల ర్యాలీలో కళా బృందాలు

కంటోన్మెంట్, నవంబర్ 4 ప్రభాతవార్త: సిక్కుల మొదటి గురువు గురునానక్ 553 జయంతి ఉత్సవాలు, ప్రకాశ్ (ఉత్సవ్) వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం సికింద్రాబాద్ గురుద్వార శ్రీ గురు సింగ్ సభ అఫ్జల్‌గంజ్ గురుద్వార సాహెబ్ సికింద్రాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నగర్ కీర్తన్ ర్యాలీ భారీ ఎత్తున నిర్వహించారు. సిక్కులు వివిధ కళా బృందాలతో భారీఎత్తున ర్యాల నిర్వహించడంతో పరిసర ప్రాంతాలన్నీ మారుమ్రోగాయి. సికింద్రాబాద్ గురుద్వార్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ మనోహర్ టాకీస్, క్లాక్‌టవర్, ప్యాట్నీ, సర్కిల్, కిమ్స్‌వే, మోండా మార్కెట్, అల్ఫాహోటల్ మీదుగా సికింద్రాబాద్ గురుద్వార సాహెబ్ వరకు ర్యాలీ కొనసాగింది. వేలాది మంది సిక్కులు తమ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ గురుద్వార సాహెబ్ అధ్యక్షులు, కుల్దీప్ సింగ్ బగ్గా, బల్దేవ్ సింగ్ బగ్గా, కమిటీ సభ్యులు ఇంద్రజిత్ సింగ్, జగన్‌మోహన్ సింగ్, హార్‌ప్రీత్ సింగ్, గులాటీ, విక్కీ, బచన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## మనోహార్ ఆఫ్రికన్ సింహాన్ని.. దత్తత తీసుకున్న ఫార్మాసిటికల్ కంపెనీ



చార్మినార్, నవంబరు 4 ప్రభాతవార్త : నెహ్రూ జూలాజికల్ పార్కులోని మనోహర్ ఆఫ్రికన్ సింహాన్ని ఒక సంవత్సరం పాటు మియాపూర్‌కు చెందిన ఆరిజిన్ ఫార్మాసూటికల్ కంపెనీ దత్తత తీసుకుంది.కంపెనీ ప్రతినిధులు అషుతోష్ అనిల్ కొత్‌వాల్,సత్యనారాయణ గిరి,బిఎల్ఎన్ దీపక్‌లు శుక్రవారం జూపార్కును సందర్శించి లక్ష రూపాయల చెక్కును జూ పార్కు డిప్యూటీ క్యూరేటర్ నాగమణికి అందజేశారు.గత సంవత్సరం ఆరిజన్ ఫార్మాసూటికల్ కంపెనీ జూపార్కులోని రాయల్ బెంగాలీ టైగర్‌ను ఏడాది పాటు దత్తత తీసుకుంది.



## ఇంటర్ కాలేజ్ బాస్కెట్‌బాల్ విజేత లయోలా అకాడమీ




అల్వాల్, నవంబరు 4 ప్రభాతవార్త: ఇంటర్ కాలేజ్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా లయోలా అకాడమి నిలిచింది. రెండు రోజులు పాటు అల్వాల్‌లోని లయోలా కళాశాలలో జరిగిన పోటీలులో 12 జట్లు పోటీ పడ్డాయి. ఫైనల్ మ్యాచ్ లయోలా విల్లా మేరీ పోటీ పడ్డాయి. పోటా పోటీగా జరిగిన ఫైనల్‌లో లయోలా ఉత్తమ ప్రదర్శనతో విజేతగా నిలిచింది. మూడవ స్థానాన్ని సెయింట్ ఫ్రాన్సిస్ దక్కించుకుంది. విజేతలకు బహుమతులను లయోలా అకాడమి ప్రిన్సిపాల్ ఫాదర్ జోజి రెడ్డి అందించారు. లయోలా బాస్కెట్‌బాల్ కోచ్ రాజా రెడ్డిని ఈ సందర్భంగా ఆయన అభినందించడం జరిగింది.

## ఘనంగా క్రిస్మస్ కేక్ మిక్సింగ్ పండుగ

అల్వాల్, నవంబరు 4 ప్రభాతవార్త: అల్వాల్ లయోలా కళాశాలలో క్రిస్మస్ హడావిడి ప్రారంభమైంది. ఫుడ్ టెక్నాలజీ ఫుడ్ సైన్స్ ఆద్వర్యంలో జెస్సీఈ వెంట్స్ క్యాటర్స్ సౌజన్యంతో గురువారం కళాశాల ఆవరణలో కేక్ మిక్సింగ్ సర్మనీ జరిగింది. క్రిస్మస్ కేకు తయారీలో ఉపయోగిం చే పదార్థాలను ఒకచోట పోసి మిక్సింగ్ చేయడం జరిగింది. ముఖ్య అతిధిగా విచ్చేసిన వైస్ ప్రిన్సిపాల్ వైస్ ప్రిన్సిపల్ పిజి ఫాదర్ జోసఫ్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను సకల జనులు సుఖ సంతోషాలుతో జరుపుకోవాలని కోరారు. లయోలా కళా శాల ఇందుకు వేదిక కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. సుమారు రెండు వేలు కేజీలు కేకును లయోలా అకాడమీలో తయారు చేయను న్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ప్రభు, ఫాదర్ ఆనంద్ కుమార్, జెస్సీఈ వెంట్స్ క్యాటర్స్ నిర్వాహకులు సంజీవ్‌రెడ్డి ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా క్రిస్మస్ కేక్ మిక్సింగ్ వేడుకలు


కేక్ మిక్సింగ్‌లో తనికెళ్లభరణి

మెహిదీపట్నం, నవంబర్ 4, ప్రభాతవార్త : మాసబ్‌ట్యాంక్ గోల్కొండ హోటల్‌లో క్రిస్మస్ కేక్ మిక్సింగ్ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ రచయిత, నిర్మాత తనికెళ్లభరణి హాజరై కేక్ మిక్సింగ్ చేసి మాట్లాడారు. ఓ హోటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ కేక్ మిక్సింగ్ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కేక్‌లో 15 రకాల డ్రైఫ్రూట్స్, 10 రకాల విస్కీలను కలిపి 45 రోజుల పాటు మగ్గిన తరువాత క్రిస్మస్ రోజు ఈ కేక్‌ను అందరికి పంచుతామని హోటల్ జనరల్ మేనేజర్ అంచల్ చెడ్డ తెలిపారు. కార్యక్రమంలో హోటల్ నిర్వాహకులు బి.వి.ఎస్. ప్రదీప్ వర్మ, హోటల్ చెఫ్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

## అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులు


పాదయాత్రలో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సున్నంరాజ్‌మోహన్

అఫ్జల్‌గంజ్, నవంబర్ 4 ప్రభాతవార్త: నిరంతరం డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని పురానాపూల్ డివిజన్ మజ్లీస్ కార్పొరేటర్ సున్నంరాజ్‌మోహన్ తెలిపారు. శుక్రవారం డివిజన్‌పరిధిలోని హుస్సేన్‌ఆలం,బోరేకి సారా బస్తీలలో అధికారులతో కలిసి పాదయాత్ర చేశారు. బోరేకిసారా బస్తీలో సిసిరోడ్డు అభివృద్ధి పనులను అంచనాలు రూపొందించాలని మున్సిపల్ ఎఇని సున్నంరాజ్‌మోహన్ ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా పాడైన పోయిన రహదారులను త్వరలోనే బిటి రోడ్డు పనులనుచేయడం జరుగుతుందన్నారు. ఈపాదయాత్రలో ఎఇ గంగా ప్రసాద్,మజ్లీస్ నాయకులు పాల్గొన్నారు.

## స్టాంపు, అండ్ రిజిస్ట్రేషన్ జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా బాధ్యతలు


జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులకు బోకె అందచేస్తున్న ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేన్

గన్‌ఫౌండ్రి,నవంబర్ 4ప్రభాతవార్త: స్టాంపు,అండ్ రిజిస్ట్రేషన్ జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా పదవి భాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులను తెలంగాణ నాన్‌గజిటెడ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేన్ మర్యాదపూర్వకంగా కలిశారు.ఆయనకు బోకె అందచేశారు.


సికింద్రాబాద్ ఆర్మీ ఏరియాలో రోడ్ల మూసి వేతలపై 5వ వార్డులోని కాలనీ ప్రతినిధులతో సమావేశమైన టిఆర్ఎస్ నేత మర్రి రాజశేఖర్ రెడ్డి తదితరులు

## 30 లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కాలేరు వెంకటేష్, పద్మా వెంకటరెడ్డి

హైదరాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త: బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో ఎఎం పిఎం లైన్‌లోని అజియా మసీదు వద్ద 30 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా వేయనున్న సిసి రోడ్డు పనులకు శుక్రవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ స్థానిక కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆ ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించి ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కాలనీలో కొన్ని చోట్ల వీధి దీపాలు వెలగడం లేదని చెట్ల కొమ్మలు ఎత్తుగా పెరిగాయని వాటిని తొలగించాలని కొత్త విద్యుత్ వైర్లు వేయాలని కోరారు. దీని వెంటనే ఎమ్మెల్యే స్పందించి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల ను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## కెసిఆర్ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయి : సాయన్న


5వార్డు వాల్మీకి నగర్‌లో కళ్యాణ లక్ష్మీ చెక్కులను అందజేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న తదితరులు

కంటోన్మెంట్, నవంబర్ 4 ప్రభాతవార్త: పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేని విధంగా అమలౌతున్నాయని కంటోన్మెంట్ నియోజక వర్గం ఎమ్మెల్యే జి.సాయన్న తెలిపారు. మారేడ్‌పల్లి మండలంలో 20, సికింద్రాబాద్ మండల పరిధిలో 25 మంది లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెకు ్కలను 5వ వార్డు వాల్మీకి నగర్‌లో ఎమ్మెల్యే సాయన్న చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడపిల్లల తల్లిదండ్రులకు భారం పడకుండా ముఖ్య మంత్రి కేసిఆర్ కళ్యాణ లక్ష్మీ వంటి పథకాలు ప్రవేశపెట్టడంతో ఎంతో ఉపసమనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మారేడ్‌పల్లి తహశీల్దార్ కె. మాధవిరెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, జిహెచ్ఎంసి మాజీ కో-అప్షన్ సభ్యుడు నరి ్సంహ్మా ముదిరాజ్, మాజీ బోర్డు సభ్యులు నళిని కిరణ్, పాండు యాదవ్, లోకనాథం, ప్రభాకర్, శ్యామ్, 5వ వార్డు టిఆర్ఎస్ అధ్యక్షుడు కిరణ్ కుమార్, టిఆర్ఎస్ నాయకులు పెద్దాల నరి ్సంహ్మా, పెంట శ్రీహరి, సదానంద్ గౌడ్, పిట్ల నాగేశ్, నాగినేని సరిత, తేజ్‌పాల్, ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## హరికథలు ప్రాచీన కళారూపాలు : డాక్టర్ కె.వి.రమణాచారి


భాగవతారిణి సప్పా భారతిలను సత్కరిస్తున్న తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి

చిక్కడపల్లి, నవంబరు 4 ప్రభాతవార్త: నాట్యం, గానం, సాహిత్యం, నటన అన్ని కళలు కలిసిన హరికథలు ప్రాచీన కళారూపాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. నల్లకుంటలోని శృంగేరి శంకర మఠంలో శ్రీ పూర్ణయజ్ఞ కళాపీఠం, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో ముట్నూరి యజ్ఞనారాయణశర్మ భాగవతార్ 113వ జయంతి సందర్భంగా 'హరికథా మహోత్సవాల' ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.వి.రమణాచారి హాజరై ప్రసంగించారు.మొదటి రోజు సప్పా భారతి(ఏలూరు) భాగవతారిణిచే 'శివకల్యాణం' హరికథాగానం అద్భుతంగా సాగింది. వయోలిన్‌పై ఎం.శశిభూషణరావు, మృదంగంపై ఎం.మురళీకృష్ణ వాద్యసహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయులు జి.వల్లీశ్వర్, శ్రీ పూర్ణయజ్ఞ కళాపీఠం కార్యదర్శి ముట్నూరి కామేశ్వరరావు, శంకర మఠం(నల్లకుంట) శాఖాధిపతి కె.కృష్ణారావు, కిన్నెర ఆర్ట్ థియేటర్స్ స్థాపక కార్యదర్శి మద్దాళి రఘురామ్, సుబ్బారావు పాల్గొన్నారు.

## బొగ్గారపు దయానంద్‌కు కళాసుబ్బారావు స్మారక పురస్కారం

చిక్కడపల్లి, నవంబరు 4 ప్రభాతవార్త: త్యాగరాయ గానసభ నిర్వహణలో గానసభ వ్యవస్థాపకులు, లలిత కళాప్రపూర్ణ కళాసుబ్బారావు స్మారక పురస్కారాన్ని శాసనమండలి సభ్యుడు బొగ్గారపు దయానంద్‌కు అందించబోతున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి వివరించారు. శనివారం ఉదయం జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనమండలి సభ్యుడు, తెలంగాణ తొలి స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి హాజరై ఈ పురస్కారాన్ని అందిస్తారు. కార్యక్రమంలో తెలంగాణ ఫిలిం ఛాంబర్ చైర్మన్ డాక్టర్ ప్రతాని రామకృష్ణగౌడ్, ప్రముఖ సంఘసేవకులు పిఎస్ఆర్.మూర్తి, తదితరులు పాల్గొంటారన్నారు.

## అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పది : కొంతం దీపిక


మోండా మార్కెట్‌లో అన్నదానం చేస్తున్న కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్, నవంబర్ 4 ప్రభాతవార్త: అన్నిదానాల్లో కన్న అన్నదానం గొప్పదని, అందు వల్ల ఆకలి మంటలతో అలమటిస్తున్న పేద ప్రజలకు అన్నదానం చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారు ముందుకు రావాలని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. అర్.పి.రోడ్డులోని కళ్యాణి ఎలక్ట్రానిక్స్ వినేయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. **మోండాలో అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న కొంతం దీపిక..** మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతం చేయాలని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక సూచించారు. మోండాలోని సోలాపూర్ జంక్షన్ వద్ద కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఆమె పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జలమండలి, జిహెచ్ఎంసి, ఇంజనీర్లు, బిజెపి నేత కొంతం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి


హోంమంత్రి మహమ్ముద్‌అలీని కలిసిన టిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్

అఫ్జల్‌గంజ్, నవంబర్ 4 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కెసిఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ హోంశాఖ మంత్రి మహమ్ముద్‌అలీ కోరారు.ఈసందర్భంగా హోంమినిష్టర్ మహమ్ముద్‌అలీని నాంపల్లి నియోజకవర్గం టిఆర్ఎస్ ఇన్‌చార్జ్ సిహెచ్.ఆనంద్‌కుమార్‌గౌడ్, టిఆర్ఎస్ నాయకులు ప్రదీప్‌కుమార్‌అగర్వాల్ మర్యాద పూర్వకంగా కలిశారు.

## ఎమ్మెల్లార్ఐటిఎంలో ఘనంగా ఓరియేంటేషన్ డే


జ్యోతిప్రజ్వలన చేస్తున్న మమతారాజశేఖర్‌రెడ్డి తదితరులు

దుండిగల్, నవంబర్ 4 ప్రభాతవార్త : నగర శివారు దుండిగల్ పరిధిలోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఎమ్మెల్లార్ఐటిఎం) కళాశాలలో శుక్రవారం ఓరియేంటేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఇపిఎఎం సిస్టమ్స్ సీనియర్ రిసోర్స్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఎమ్మాన్యూయల్ గోసులా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తును పొందేందుకు కృషి చేయాలని, సాంకేతిక విజయాల దిశగా దేశం అభివృద్ధి చెందాలని, విద్యార్థులందరికి ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. గౌరవ అతిథి నాగార్జున మల్లాడి మాట్లాడుతూ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్య అనేది కోరుకున్నది సాధించే స్వేచ్ఛ అని అభివర్ణించారు. మాకళాశాల చదువుతున్న ప్రతి విద్యార్థిని ఉన్నతస్థానాలకు చేర్చాలనే కాంక్షతో యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డా.కెవి.రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తుకు ముఖ్యమైన పాత్ర పోషించే ఉపాధ్యాయులను తల్లిదండ్రులతో పాటు గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్లార్ గ్రూప్స్ చైర్మన్, అంతర్జాతీయ అథ్లెట్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కోశాధికారి మమతా రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అన్నీరాజాపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలి



ప్రదర్శనలో పాల్గొన్న మహిళలు

హైదరాబాద్, నవంబరు 4 ప్రభాతవార్త: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమిస్తే అణిచివేయడాన్ని, అక్రమ కేసులు పెట్టడాన్ని చూస్తు ఊరుకోబోమని తీవ్రంగా ప్రతిఘటిస్తామని భారత జాతీయ మహిళా సమాఖ్య సీనియర్ నాయకురాలు పి.ప్రేమ్‌పావని హెచ్చరించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలు చేపడితే వ్యతిరేకంగా గళం విప్పుతామని, ఆందోళనలు చేసే హక్కు ఉందని ఆమె స్పష్టం చేశారు. సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి అనీరాజాపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సమాఖ్య హైదరాబాద్ జిల్లా అధ్వర్యంలో శుక్రవారం సత్యనారాయణరెడ్డి భవన్‌వద్ద మహిళలు ప్రదర్శన నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. 2021లో న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద అన్నీరాజా పౌరసత్వం విషయంపై బహిరంగ సభ నిర్వహించి తన గళాన్ని వినిపించడం నేరమా? అని ఆమె ప్రశ్నించారు. అన్నీరాజా చట్టాలను ఉల్లంఘించారని ప్రభుత్వం ప్రకటించడం సిగ్గు చేటని విమర్శించారు. తక్షణమే బిజెపి ప్రభుత్వం అన్నీరాజాపై పెట్టిన అక్రమ కేసును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రదర్శనలో సమాఖ్య నాయకులు పడాల నళిని, ఎస్.ఛాయాదేవి, జ్యోతిశ్రీమాన్, సాయిఈశ్వరి, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్‌గృహకల్ప ఇళ్లల్లో సమస్యలు పరిష్కరించాలి

### ఇంటి పైకప్పు కూలి గాయపడ్డ బాధితుడిని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు


రాజీవ్‌గృహకల్ప ఇంట్లో గాయపడ్డ బాధితుడితో కలిసి బండ్లగూడ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న పీసీసీ సభ్యులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్

నార్సింగి, నవంబర్ 4 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ గంధంగూడ రాజీవ్‌గృహా కల్ప ఇళ్లల్లోని సమస్యలు పరిష్కరించాలని పీసీసీ సభ్యులు బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తదితరులు కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. శుక్రవారం ఉదయం రాజీవ్‌గృహకల్ప ఇంట్లో పైకప్పు శిథిలాలు పడి తీవ్రంగా గాయపడ్డ వ్యక్తిని కార్పోరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డితో కలిసి జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పరామర్శించారు. అలాగే పాడైపోయిన ఇళ్లను, నీళ్లు, డ్రైనేజి సమస్యలతో సతమతం అవుతున్న ప్రజలకు ధైర్యం చెప్పారు. మీ ఇబ్బందులు పరిష్కారమయ్యేలా కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని భరోసా కల్పించారు. అనంతరం రాజీవ్‌గృహా కల్ప ఇళ్లలోని సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇస్తామని గప్పాలు కొట్టిన టీఆర్ఎస్ సర్కారు ఎనమిదిన్నరేళ్లు అవుతున్నా ఇంకా ఒక్కరికి కూడా రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఇవ్వలేదన్నారు. వేలాది మంది అర్హులుంటే పదుల సంఖ్యలో ఇస్తామంటే ఎలా కుదురుతుందన్నారు. టీఆర్ఎస్ కొత్త ఇళ్లు కట్టి ఇవ్వకుండా, కాంగ్రెస్ కట్టించిన రాజీవ్‌గృహా కల్ప ఇళ్లల్లో సమస్యలు పరిష్కరించకుండా పేద ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. శ్లాబుల శిథిలాలు కూలి ప్రజలు తీవ్రంగా గాయపడుతున్నా, చనిపోతున్నా పాలకులు, అధికారులలో చలనం రాకపోవడం దారుణమని మండి పడ్డారు. రాజీవ్‌గృహా కల్ప ఇళ్లల్లో సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేదంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డి.నవీన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# శరవేగంగా సాగుతున్న స్కైవాక్ వంతెన పనులు

### జనవరిలో రూ.25 కోట్లతో పనులు ప్రారంభం



ఉప్పల్ చౌరస్తాలో శరవేగంగా నిర్మాణం సాగుతున్న స్కైవాక్ వంతెన పనులు, స్కైవాక్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న హెచ్ఎండిఏ ఇంజనీర్ తదితరులు

ఉప్పల్, నవంబరు 4 ప్రభాతవార్త : ఉప్పల్ చౌరస్తాలో అధునాతన హంగులతో నిర్మిస్తున్న స్కైవాక్ నిర్మాణం పనులు శరవేగంగా సాగుతున్నాయి. సుమారు రూ.25 కోట్ల వ్యయంతో హెచ్ఎండిఏ ఆధ్వర్యంలో చేపట్టిన స్కైవాక్ నిర్మాణం పనులు రెండేళ్ల క్రితం ప్రారంభించారు. పనులు తుది దశకు చేరుకోవడంతో వచ్చే జనవరిలో ప్రారంభించేందుకు రంగం సిద్దం చేస్తున్నారు. ఉప్పల్ చౌరస్తా చుట్టూ ఉన్న రామంతాపూర్, హబ్సిగూడ, బోడుప్పల్, నాగోల్ ప్రాంతాలను కలుపుతూ స్కైవాక్ వంతెన నిర్మాణం సాగిస్తున్నారు. ఉప్పల్ చౌరస్తాలోని మెట్రో స్టేషన్‌కు అనుసంధానం చేస్తూ ప్రత్యేకంగా స్కైవాక్ పనులు సాగుతున్నాయి. సుమారు 640 మీటర్ల పొడవు, తొమ్మిది మీటర్ల ఎత్తు, మూడు నుంచి ఆరు మీటర్ల వెడల్పులో నిర్మిస్తున్న ఈ వంతెనకు నాలుగు వైపులా లిఫ్టులు, ఎస్కలేటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మొత్తం ఆరు ఆరు ప్రాంతాల్లో లిఫ్టులు, ప్రత్యేకంగా ఇనుప మెట్లు ఏర్పాటు చేస్తున్నారు. నాగోల్ వైపు మెట్రో స్టేషన్, రామంతాపూర్ రోడ్డు మున్సిపల్ పార్కు, వరంగల్ బస్టాప్, ఉప్పల్ పోలీస్‌స్టేషన్, ఉప్పల్ విద్యుత్ కార్యాలయం ముందు ప్రత్యేకంగా లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. వచ్చే డిసెంబర్ చివరి నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉండగా, జనవరి మధ్యలో వంతెన ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. స్కైవాక్ వంతెనపై ప్రత్యేకంగా సిసిరోడ్లు, స్టీల్ ఉపయోగించి పనులు చేపట్టారు. వంతెనపై రూఫ్ మెటల్ వాడుతున్నారు. మల్టీవాల్డ్ పాలి కార్బొనేట్ సీట్‌లతో స్టాండింగ్ సీట్ కనెక్షన్ ఇస్తున్నారు. వంతెనపైకి వచ్చేందుకు, కిందికి దిగేందుకు లిఫ్టులు వాడుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. హెచ్ఎండిఏ నిధులతో చేపడుతున్న ఈ పనులతో ఉప్పల్ చౌరస్తా రూపురేఖలు మారిపోనున్నాయి.

**స్కైవాక్ వంతెన పనులు పరిశీలన..** ఉప్పల్ చౌరస్తాలో నిర్మిస్తున్న స్కైవాక్ వంతెన నిర్మాణ పనులను శుక్రవారం హెచ్ఎండిఏ ఇంజనీర్ రమేష్‌కుమార్, డిప్యూటి ఇంజనీర్ సుభాష్, ఎఇ చందు పరిశీలించారు. స్కైవాక్‌పై నూతనంగా వేసిన సిసి రోడ్డును పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని, వచ్చే డిసెంబర్‌లోగా పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. స్కైవాక్ చుట్టూ పూర్తి స్టీల్‌తో ప్రహరి ఉంటుందని, ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే విధంగా స్కైవాక్ ఉంటుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వంతెన ప్రారంభం అయితే ప్రజలకు పూర్తి స్థాయిలో ఇబ్బందులు తొలగిపోతాయని వారు పేర్కొన్నారు.

**జనవరిలో స్కైవాక్ వంతెన ప్రారంభం..** హెచ్ఎండిఏ నిధులతో చేపడుతున్న ఉప్పల్ స్కైవాక్ వంతెన వచ్చే జనవరిలో ప్రారంభించేందుకు రాత్రి, పగలు పనులు చేపడుతున్నారు. ఇప్పటికే వంతెనపై పూర్తిస్థాయిలో స్లాబు పనులు చేపట్టిన అధికారులు, దీనిపై సిసి స్లాబు వేస్తున్నారు. వచ్చే జనవరిలో స్కైవాక్ వంతెన ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. ఇప్పటికే అన్ని లిఫ్ట్ వద్ద పనులు పూర్తి చేశామని, వంతెన పై భాగంగా సైడ్ వాల్ పనులు సాగుతున్నాయని అధికారులు తెలిపారు. వంతెన ప్రారంభం అయితే ఉప్పల్ రూపురేఖలు మారిపోతాయని వారు పేర్కొన్నారు.

## మంచిరేవుల దళితుల స్మశాన వాటిక కబ్జాను అడ్డుకోవాలి

నార్సింగి, నవంబర్ 4 ప్రభాతవార్త : గండిపేట్ మండలం మంచిరేవుల గ్రామంలో ఉన్న దళితుల స్మశాన వాటిక కబ్జాను అధికారులు అడ్డుకోవాలని ప్రభుత్వ స్థలాలు, పార్కులు, రోడ్ల విస్తీర్ణ పోరాట కమిటీ కార్యదర్శి, అధ్యక్షులు రుద్రకుమార్, శ్రీకాంత్‌లు పేర్కొన్నారు. శుక్రవారం మంచిరేవుల గ్రామంలో కబ్జాకు గురవుతున్న దళితుల స్మశాన వాటికను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ దశాబ్దాల తరబడి ఉన్న దళితుల స్మశాన వాటిక కొనసాగుతూ వస్తుందని, ఇటీవల కొంత మంది బడాబాబులు ఈ దళిత స్మశాన వాటికపై మట్టి పోసి కబ్జా చేస్తుండడం దారుణమన్నారు. ఈ స్మశాన వాటికను కబ్జాదారుల నుంచి కాపాడాలని దళితులు వెళ్లి రెవెన్యూ అధికారులకు విన్నవించినా స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి దళితుల స్మశాన వాటికను కబ్జాదారుల నుంచి కాపాడాలని, లేని ఎడల పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని, న్యాయ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పద్మారావ్, రత్నం, శ్యామ్, సత్యనారాయణ, యాదగిరి, నర్సయ్య, రాములమ్మ, అనిత, మమత,శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద యువతులకు వరంగా మారిన కల్యాణలక్ష్మీ


కోకాపేట్ ఐదోవార్డుకు చెందిన చెన్నమ్మకు కళ్యాణలక్ష్మీ చెక్‌ను అందజేస్తున్న కౌన్సిలర్ శివారెడ్డి, ఆర్.ఐ మహిపాల్‌రెడ్డిలు

నార్సింగి, నవంబర్ 4 ప్రభాతవార్త : నిరుపేద యువతులకు కళ్యాణ లక్ష్మీ పతకం వరంగా మారిందని కోకాపేట్ కౌన్సిలర్ గంగిడి శివారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నార్సింగి మున్సిపల్ ఐదో వార్డుకు చెందిన చెన్నమ్మకు కళ్యాణలక్ష్మీ కింద వచ్చిన రూ.లక్షా 116.చెక్కును రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మహిపాల్‌రెడ్డితో కలిసి శివారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడితూ ఉద్యమ సమయంలో పేద, మధ్య తరగతి ప్రజల కష్టాలను కళ్లారా చూసిన సీఎం కేసీఆర్ వారి కూతుళ్ల పెళ్లి కోసం కళ్యాణలక్ష్మీ పతకం కింద రూ.లక్షా 116ను ఇచ్చి ఆదుకుంటున్నారని తెలిపారు. సంక్షేమ పతకాలు, అభివృద్ధి రెండింటికి సమ ప్రాధాన్యతనిస్తూ తెలంగాణ రాష్ట్రంను వేగంగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు.కళ్యాణలక్ష్మీ చెక్కును అందుకున్న చెన్నమ్మ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేసిన ఈ సహాయంను జీవితాంతం గుర్తుంచుకుంటానని తెలిపారు.


నగరంలో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC
నిట్ సం.: 23/GHMC/MPT/EE/2022-23. పనిపేరు: C.C. రోడ్లు. అంచనా విలువ ECV: రూ.388.00 లక్షలు. బిడ్‌ల స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ మరియు సమయం: 07.11.2022న మ.1.00గం.లు. 14.11.2022న మ.1.30గం.లు. అధికారి పేరు మరియు చిరునామా: శ్రీ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, GHMC, మూసాపేట సర్కిల్-23, సెల్: 9989930362. మరిన్ని వివరములను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @www.tender.telangana.gov.in పై చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, GHMC, మూసాపేట డివిజన్-23.
DIPR.No.8616-PP/CL/Advt/1/2022-23 తేదీ: 04.11.2022

## మునుగోడు ధనప్రవాహంలో ప్రజాస్వామ్యం అపహాస్యం: దర్పల్లి



నిరాహార దీక్షలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**సైదాబాద్, నవంబరు 4 (ప్రభాతవార్త):** మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపి, టిఆర్ఎస్‌లు ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసి ఎన్నికలవ్యవస్థనే అపహాస్యం పాలు చేశారని ఆరోపిస్తూ జిహెచ్ఎంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం లింగోజిగూడలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం చౌరాస్తలో నిరాహార దీక్షను చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చెరుకు సుధాకర్, ఎల్‌బినగర్ ఇంఛార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్‌లు నిరాహార దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ డబ్బులతో ఓట్లు కొనుక్కునే సంస్కృతిని తెస్తున్న బిజెపి, టిఆర్ఎస్ నాయకులు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని అన్నారు. విచ్చలవిడిగా డబ్బు, మద్యం కుమ్మరించి ప్రజలను తప్పుదారి పట్టిస్తూ తాత్కాలికంగా పబ్బం గడుపుకునేలా దుస్థితికి దిగజారారని ఆయన ఘాటుగా విమర్శించారు. కోట్ల రూపాయలు ఖర్చు చేసి గెలిచిన వారు ఆ తర్వాత ప్రజలకు ఏమి మేలు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల వ్యవస్థను పూర్తిగా డబ్బుతో ముడిపడేలా చేయడం వల్ల రాబోయే రోజుల్లో విపరీత పరిణామాలు చోటు చేసుకోవడం ఖాయమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లారం శ్రీనివాసులు, శ్రీధర్‌గౌడ్, సుధీర్‌రెడ్డి, శివగౌడ్, నరేష్‌రెడ్డి, శ్రీనాథ్‌రావు, స్వర్ణ మాధవి, కవిత, సౌమ్య, సరిత, స్వప్న పాల్గొన్నారు.

## రూ. కోటి 50లక్షలతో అభివృద్ధి పనులు : ఎమ్మెల్యే మైనంపల్లి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరెడ్‌మెట్, నవంబర్ 4 (ప్రభాతవార్త):** మల్కాజిగిరి నియోజకవర్గంలోని డివిజన్లను పూర్తి స్థాయిలో చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని వినాయక్‌నగర్‌డివిజన్ వినోభనగర్, అంబేద్కర్ నగర్, కాకతీయనగర్, తారకరామ్ నగర్, చంద్రగిరి కాలనీ తదితర ప్రాంతాల్లో రూ. 1కోటి 50లక్షలతో సీసీ రోడ్డు పనులను అధికారులు, కార్పొరేటర్లు, స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడమే లక్ష్యమన్నారు. అంతే కాకుండా అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రారంభించిన అభివృద్ధిపనుల్లో ఎటువంటి జాప్యం, లోపం జరిగిన సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్యలక్ష్మి, ప్రేమ్ కుమార్, ఈఈ లక్ష్మణ్, డీఇ లౌక్య, ఏఇ సత్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, బద్దం పరుశరామ్‌రెడ్డి, పిట్ల శ్రీనివాస్, గుండా నిరంజన్, ఉపేందర్‌రెడ్డి, రాముయాదవ్, డివిజన్ అధ్యక్షులు సూరి, ప్రభాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సంతోష్, రాందాస్, సాయిగౌడ్, బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మల్కాజిగిరి ఎమ్మార్వో వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ రాజ్యలక్ష్మితో కలసి మల్కాజిగిరి ప్రభుత్వకోర్టు వెనుకాల ఉన్న ప్రభుత్వ భూమికి కంచె వేసారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టండి : జడ్‌సి పంకజ



సమస్య తెలుసుకుంటున్న జోనల్ కమిషనర్ పంకజ

**ఎల్.బి.నగర్, నవంబర్ 4 (ప్రభాతవార్త):** డ్రైనేజీ సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎల్బీనగర్ జోనల్‌కమిషనర్ పంకజ జలమండలి అధికారులను ఆదేశించారు. సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్‌కాలనీ ప్రధానకార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు అభ్యర్థన మేరకు శుక్రవారం అధికారులు కాలనీ సమస్యను పరిశీలించారు. కూరగాయల వ్యాపారులు రోడ్డుపైనే కూరగాయలు వదిలేయడంతో కూరగాయలు డ్రైనేజీలోకి వెళ్లి పైప్‌లైన్లలో జామవుతున్నాయని శ్రీనివాసరావు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కాలనీలో డ్రైనేజీ లీకేజీలు ఏర్పడి తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వెంటనే సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు త్వరలో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ అశోక్‌రెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, డిఈ విజయ్‌కుమార్, పారిశుద్ధ్య విభాగం డిఈ నీలిమ, డాక్టర్స్ కాలనీ ఉపాధ్యక్షులు జనార్ధనరెడ్డి, విజయకుమార్ పాల్గొన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి : డిఇ సురేష్



విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న డిఇ సురేష్

**మలక్‌పేట, నవంబర్ 4 (ప్రభాతవార్త):** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చంపాపేట విద్యుత్ శాఖ డిఇ సురేష్ పేర్కొన్నారు. డిఇ కార్యాలయం ఆవరణలో విద్యుత్‌వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు వినియోగదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలగురించి అధికారుల దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా డిఇ సురేష్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందిస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఇలు రాజేందర్, నాగిని, ఎఏఇ పావని తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తాం



పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్

**హయత్‌నగర్, అక్టోబరు 4 (ప్రభాతవార్త):** సమస్యల తీవ్రతను బట్టి నిధులను కేటాయించి కాలనీల అభివృద్ధికి కృషిచేస్తానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఉషోదయ కాలనీ, శాంతివనం టౌన్‌షిప్‌లో కొనసాగుతున్న సీసీరోడ్డు పనులను శుక్రవారం కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్ జీహెచ్ఎంసీ పరిధికి చివరలో ఉండడం, కాలనీలు విస్తరిస్తుండడంతో మౌళికసదుపాయాల కొరత ఉందని దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రణాళిక బద్ధంగా పనులు పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. అధికారులు అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయడంతో పాటు నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీపడకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ నరేంద్రతేజ, కాలనీప్రతినిధులు నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్ఎన్ఆర్ కాలనీ నుంచి బస్సులు నడపాలని వినతి...

**హయత్‌నగర్, అక్టోబరు 4 (ప్రభాతవార్త):** పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఆర్.ఎన్.ఆర్ కాలనీ నుంచి దిల్‌సుఖ్‌నగర్ వరకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ 12వ వార్డు కౌన్సిలర్ లక్ష్మణ్ శుక్రవారం బండ్లగూడడిపోమేనేజరు రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాలనీలో పేద మధ్య తరగతి ప్రజలు తమ జీవనోపాధికోసం నిత్యం నగరంలోనే వేరు వేరు ప్రాంతాలకు వెళ్తుంటారని తెలిపారు. విద్యార్థులు చదువుల కోసం దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలోని కళాశాలలకు నిత్యం వెళ్తారన్నారు. వారంతా తిరిగి ఇళ్లకు చేరుకోవడం ఆలస్యం అవుతుందన్నారు. సరిపడ బస్సులు లేకపోవడంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారని ముఖ్యంగా బాలికలు, మహిళు, వృద్ధులు వికలాంగుల పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని డీఎంను కోరారు. దీనిపై డీఎం సానుకూలంగా స్పందించారని, పరిశీలన చేసి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చినట్లు కౌన్సిలర్ వివరించారు. కార్యక్రమంలో శివకుమార్, శంకర్ పాల్గొన్నారు.

## అరుంధతి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**నేరెడ్‌మెట్, నవంబర్ 4 (ప్రభాతవార్త):** నేరెడ్‌మెట్ డివిజన్ పరిధిలోని చంద్రబాబు నాయుడు కాలనీలో శుక్రవారం కాలనీ కమిటీ ఆధ్వర్యంలో దుండిగల్‌లోని మర్రి అరుంధతి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు. బీపి, షుగర్, కన్ను, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఈఎన్‌టి, ఆర్థోపెడిక్స్ తదితర వాటిపై సుమారు 150 నుండి 200 మంది రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. నెలకు ఒక్కసారి తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని వైద్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో అరుంధతి ఆసుపత్రి డీన్ డాక్టర్ ఉదయ్‌కుమార్, స్పెషలిస్ట్ డాక్టర్లు హైదర్ అబ్బాస్, ఫరీస్తా, ఆనంద్, కాలనీ అధ్యక్షులు కేశపాగ రాంచందర్, కాశయ్య, రామక్రిష్ణ, గిరిబాబు, నరేష్, లక్ష్మణ్, సురేష్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మిధానిలో 'విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ వాలెడిక్టరీ'



జాగృతి సంచికను విడుదల చేస్తున్న 'మిధాని' అధికారులు

**సైదాబాద్, నవంబరు 4 (ప్రభాతవార్త):** మిశ్రధాతు నిగమ్ లిమిటెడ్‌లో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ వాలెడిక్టరీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గత నెల 31వ తేదీ నుంచి ఈనెల 6వ తేదీవరకు సెంట్రల్ విజిలెన్స్ కమీషన్ సూచనల మేరకు మిధానిలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను నిర్వహిస్తున్నారు. శుక్రవారం జరిగిన వాలెడిక్టరీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ మాజీ డైరెక్టర్ సుర్జీత్ సింగ్ మాన్ హాజరై మాట్లాడుతూ వృత్తిపరంగా, వ్యక్తిగత జీవితంలో అవినీతిని నిర్మూలించడానికి అనుసరించాల్సిన మార్గాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మిధాని ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.ఝా, ఫైనాన్స్ డైరెక్టర్ ఎన్.గౌరీ శంకర్‌రావు, ప్రొడక్షన్ అండ్ మార్కెటింగ్ డైరెక్టర్ టి.ముత్తుకుమార్, ఐపిఓఎస్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఉపేంద్ర వెన్నం తదితరులు పాల్గొన్నారు. కాగా 'అవినీతి రహిత భారతదేశం-బలమైన భారతదేశం' అనే అంశం ముఖ్య విషయంగా వివిధ క్విజ్ పోటీలను మిధానిలో నిర్వహించారు. ఈ క్విజ్ పోటీల విజేతలతో పాటు జాగృతి పత్రిక రచయితలకు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు. సర్దార్ వల్లభాయి పటేల్ జయంతిని పురస్కరించుకుని గత నెల 31వ తేదీన మిధానిలో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్‌ను ప్రారంభించారు.

## కార్తీక పౌర్ణమి సందర్బంగా ఉచితంగా సత్యనారాయణ వ్రతాలు

**మలక్‌పేట, నవంబర్ 4 (ప్రభాతవార్త):** ఓల్డ్ మలక్‌పేట రేస్ కోర్సు రోడ్డులోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 7వ తేదీన కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఉచితంగా శ్రీ సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ బాబు సుదర్శన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ స్వామివ్రతం చేయించుకునే భక్తులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

## లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్కులు : ఎమ్మెల్యే బేతి



లబ్దిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

**ఉప్పల్, అక్టోబరు 4 (ప్రభాతవార్త):** నిరుపేదలకు సిఎం సహాయనిధి పథకం ఒక వరంలాంటిదని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం నియోజకవర్గంపరిధిలోని పలుప్రాంతాల్లోని లబ్దిదారులకు మంజూరైన సిఎం సహాయనిధిచెక్కులు హబ్సిగూడలో అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సిఎం సహాయనిధి పథకం ద్వారా చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్దిదారులు చంద్రయ్యకు రూ.60వేలు, కె.కళావతికి రూ.60వేలు, ఎం.బాలయ్యకు రూ.60వేలు, కనకరాజుకు రూ.57వేలు, బాల నరసింహాకు రూ.48వేలు, రమేష్‌చారికి రూ.22వేలు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మహిపాల్‌రెడ్డి, గరిక సుధాకర్, శివ, శోభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అనిల్ కుటుంబ సభ్యులకు బండారి లక్ష్మారెడ్డి పరామర్శ



అనిల్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బండారి లక్ష్మారెడ్డి

**ఉప్పల్, అక్టోబరు 4 (ప్రభాతవార్త):** ఉప్పల్ విజయపురికాలనీలో తప్పిపోయిన పదో తరగతి విద్యార్థి లింగంపల్లి ప్రణవ్ తల్లిదండ్రులను శుక్రవారం టిఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఉప్పల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి లింగంపల్లి ప్రణవ్ ఈనెల 1వ తేదిన ఇంటి నుంచి బయటకు వెళ్లి తప్పిపోయాడు. దీంతో విషయం తెలుసుకున్న టిఆర్ఎస్ నేత బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్‌కు చేరుకుని అనిల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థి అనిల్ ఆచూకీ తెలుసుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. దీనిపై పోలీసులను కలిసి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ఆకుల మహేందర్, వేముల మహేష్‌గౌడ్, బైరి నవీన్‌గౌడ్, అన్య బాలకృష్ణ, బాషపల్లి నిరంజన్‌చారి, సుక్క కిరణ్, పండ్ల కిషన్‌గౌడ్, మాస శేఖర్, జ్ఞానేశ్వర్‌గౌడ్, మస్తాన్, సత్యరాజ్‌గౌడ్, కృష్ణామాచారి, సతీష్‌చారి, రావుల నవీన్, సల్ల రాజిరెడ్డి, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి సరూర్‌నగర్ వెంకటేశ్వర కాలనీలోని వెంకటేశ్వర దేవాలయ 38వ బ్రహ్మోత్సవాలు

**ఎల్.బి.నగర్, నవంబర్ 4 (ప్రభాతవార్త):** సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలోని శ్రీభూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి దేవాలయ 38వ సప్తాహ్నక బ్రహ్మోత్సవాలు ఈ నెల 5వతేదీ నుండి 11వతేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయ కమిటీ ఛైర్మన్ కోరుపోలు భాస్కర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ఉత్సవాలలో భాగంగా 5న గణపతిపూజ, అంకురార్పణ మంత్రాపుష్పం,6న గణపతి, సుబ్రహ్మణ్యస్వాములకు పంచామృతాభిషేకం,హోమం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, మహా అన్నప్రసాదం, పల్లకిసేవ, 7న దేవతా మూర్తులకు అభిషేకం, మహాన్యాస ఏకదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, ఉమామహేశ్వరస్వామికి లక్ష పత్రిపూజ, పల్లకిసేవ, జ్వాలాతోరణం, 8న శ్రీవీరాంజనేయస్వామికి పంచామృతాభిషేకం, మన్యాసుక్త హోమం,9వ శ్రీవారికి పంచామృతాభిషేకం, శ్రీసుదర్శనహోమం, లక్షతులసిపూజ, 10న శ్రీమహాలక్ష్మిహోమం, శ్రీవీరాంజనేయస్వామికి లక్ష తమలపాకులపూజ, అమ్మవార్లకు కుంకుమార్చన, 11న శ్రీవారికి అష్టోత్తర శతకలభిషేకం, శ్రీవెంకటేశ్వరస్వామి వారి కళ్యాణం, గరుడవాహనంపై స్వామి వారి ఊరేగింపు, ధ్వజావరోహనం కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి టీ.కాంతారావు, సభ్యులు వేణుబాబు, మహేందర్, సాయికుమార్, విజయ్‌కుమార్, భోగేశ్వర్‌రావు, సుబ్బారావు, మురళి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాసకుమార్, శంకర్, సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

## కోర్టు ఆదేశాలతో శ్రీ సంతోష్ దాభా బోర్డు తొలగింపు



దాభాలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**మలక్‌పేట, నవంబర్ 4 (ప్రభాతవార్త):** మలక్‌పేటలో శ్రీ సంతోష్ దాభా పేరుతో అక్రమ వ్యాపారలు నిర్వహిస్తూ అసలైన సంతోష్ దాభాగా ప్రచారం చేస్తున్న వారిపై సిటీ సివిల్ కోర్టు ఆదేశాలమేరకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. సంతోష్ దాభా ఎక్స్‌క్లూజివ్ ట్రేడ్ మార్క్ యజమాని మనోజ్‌కుమార్ సాంక్లా దీనికి సంబంధించి వివరాలు వెల్లడించారు. న్యూ మలక్‌పేటలో శ్రీ సంతోష్ దాభా పేరుతో కొందరు అక్రమ వ్యాపారం చేస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారని కోర్టును ఆశ్రయించారు. దీంతో శ్రీ సంతోష్ దాభా బోర్డు తొలగించి చర్యలు తీసుకోవాలని 11వ అదనపు కోర్టు ఛీఫ్ జడ్జి ఉమాదేవి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కోర్టు బెలిఫ్ నర్సింహ్మారెడ్డి, చాదర్‌ఘాట్ పోలీసులు తనిఖీలు నిర్వహించి బిల్లింగ్ మిషన్, కంప్యూటర్ మెనూ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా న్యాయవాది అభిషేక్ అగర్వాల్ మాట్లాడుతూ నగరంలో సంతోష్ దాభా బ్రాండ్ ఇమేజ్‌ను ఆసరాగా చేసుకుని అక్రమ దాభా వ్యాపారాలు నిర్వహిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్నారని తెలిపారు.

## కెసిఆర్, కేటీఆర్‌లపై కేసు బుక్ చేయకపోతే న్యాయపోరాటం చేస్తా : శ్రీవాణి



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్‌కుమార్

**ఎల్.బి.నగర్, నవంబర్ 4 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్రంలో ఎవరికి రక్షణ లేకుండా పోయిందని ప్రశ్నించే వారిపై పోలీసులు అక్రమ కేసులు బనాయిస్తున్నారని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తనపై అనవసరంగా పోలీసులు కేసు నమోదు చేశారని తప్పుపడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌లు బాధ్యతగల పదవిలో ఉండి ప్రెస్ మీట్, బహిరంగ సభలలో వాడిన అభ్యంతరకర భాషను పోలీసులకు వివరించి కేసు నమోదు చేయాలని లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. అభ్యంతరకర భాషవాడేది, మాట్లాడేది నేనుకాదని కేసీఆర్, కేటీఆర్‌లని తెలుపుతూ పలువురు కార్పొరేటర్లతో కలిసి సిసిఎస్ ఏసీపీకి కలిసి కెసిఆర్, కేటీఆర్‌పైన ఫిర్యాదు చేశామని తెలిపారు. వారికి వెంటనే నోటీసులు ఇవ్వాలని ఏసీపీకి విజ్ఞప్తి చేశారు. వాళ్లకి నోటీస్ ఇవ్వలేని పక్షంలో ఈ పదాలు వాడొచ్చని ఎన్‌ఓసి విడుదల చేయాలని ఏసీపీని కోరారు. తెలంగాణ పోలీస్‌లు ఈ రెండు చేయలేని పక్షాన న్యాయపోరాటం కోసం కోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. ఇష్టం ఉన్నట్లు మాట్లాడడానికి కేసీఆర్, కేటీఆర్‌లు రాజులు కాదని రాజ్యాంగంలో పౌరులందరూ ఒకటే అనే విషయాన్ని గుర్తుంచుకొని వెంటనే వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, దేవర కరుణాకర్, శంకర్‌యాదవ్, శశికళ, మహాలక్ష్మి, సురేఖ, పద్మ వెంకట్‌రెడ్డి, శ్రీవాణి, చైతన్య, అమృత, సుప్రియ, లాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఔట్ సోర్సింగ్ కార్మికులకు పర్మనెంట్ చేయాలి : చేతన



ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ చేతన తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 4 (ప్రభాతవార్త):** జిహెచ్ఎంసి, జల మండలి, ఉస్మానియా తదితర ప్రాంతాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం గ్రేటర్ కార్యాలయం ముందు బిజెపి ఆధ్వర్యంలో భారీ ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సూచించారు. దీనిపై ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## సెన్సార్‌బోర్డు సభ్యుడు మొగుళ్ళ పల్లికి బండి సంజయ్ సత్కారం

**ఎల్.బి.నగర్, నవంబర్ 4 (ప్రభాతవార్త):** సెంట్రల్ సెన్సర్ బోర్డు సభ్యునిగా డాక్టర్ మొగుళ్ళపల్లి ఉపేందర్‌గుప్తా నియామకం కావడం పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, మాజీ రాజ్యసభ సభ్యులు గరికపాటి మోహన్‌రావు, లంకల దీపక్‌రెడ్డిలు అభినందనలు తెలియజేస్తూ మొగుళ్ళపల్లిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మొగుళ్ళపల్లి వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్ది చెంద్రమౌళి, నిరటి రాజు, మొగుళ్లపల్లి యూవసేన అధ్యక్షులు చొప్పవరపు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## న్యాయ సేవ సంస్థ సేవలు అభినందనీయం : బన్నాల గీత




చిలుకానగర్‌లో న్యాయసేవా సంస్థ సేవలపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ గీత ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 4 (ప్రభాతవార్త):** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా అందజేస్తున్న సేవలు అభినందనీయమని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం చిలుకానగర్‌లో న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా అందిస్తున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం న్యాయ సేవసంస్థ ద్వారా పేద, మధ్య తరగతి కుటుంబాలలో జరిగే కేసులకు మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలు పరిష్కరించుకునేందుకు వీలుందన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, కె.జగన్, రామానుజం, శ్రీకాంత్, పవన్, శ్రీకాంత్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా కృష్ణాదిశేషు

**వనస్థలిపురం, నవంబర్ 4 (ప్రభాతవార్త):** కేంద్ర ప్రభుత్వ ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడిగా ప్రముఖ వాస్తు నిపుణులు కృష్ణాదిశేషు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర రీజియన్ సెన్సార్ బోర్డు అధికారి నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ ఎస్‌కెడినగర్‌లో నివాసముండే కృష్ణాదిశేషు ప్రముఖ వాస్తు నిపుణులు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్‌ఇండియా విశ్రాంత ఉద్యోగి, ఇల్లు కట్టడంలో, వాస్తు ప్లానింగ్‌తోపాటు కట్టడంలో మెలకువులు, ఇతర అంశాలు సామాన్యులకు అర్థమయ్యేలా వ్యాసాలు రాస్తూ పలు దిన, వార పత్రికలు, టివిల ద్వారా తెలుగు రాష్ట్ర పాఠకులకు సుపరిచితులు. కృష్ణాదిశేషు గతంలో పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జ్యోతిర్వాస్తు పిజి డిప్లొమా కోర్సు రూపొందించడంలో సభ్యుడిగా ఉండి పలు సామాజిక కార్యక్రమాల్లో పని చేసారు. సెన్సార్ బోర్డు సభ్యుడిగా నియమితులైన కృష్ణాదిశేషుకు ప్రముఖులు పట్టాభిరామ్, గంపా నాగేశ్వర్‌రావు, తడకమళ్ల విజయ్‌కుమార్, ఆలేటి రవికుమార్, అల్లాడి పరమేశ్వర్ అభినందనలు తెలిపారు.

## శివారు కళాశాలలకు బస్సుల సంఖ్యను పెంచాలని ఆందోళన



డిపో ముందు ఆందోళన చేస్తున్న నాయకులు, విద్యార్థులు

**హయత్‌నగర్, అక్టోబరు 4 (ప్రభాతవార్త):** శివారు కళాశాలలకు ఆర్టీసీ సరిపడ బస్సులను నడపక పోవడంతో కిక్కిరిసిన బస్సులతో విద్యార్థులు ప్రమాదాల భారిన పడుతున్నారని బస్సులను పెంచాలని కోరుతూ అవాంతి కళాశాల విద్యార్థులు ఆల్‌ఇండియా డెమోక్రాటిక్ స్టుడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్ఓ)ప్రతినిధులతో కలిసి హయత్‌నగర్ డిపోముందు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఏఐడీఎస్ఓ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ... కిక్కిరిసిన బస్సులో ఎక్కబోతూ ఇటీవల అవాంతి కళాశాలకు చెందిన విద్యార్థిని తీవ్రంగాగాయపడిందని తెలిపారు. బస్‌పాస్ ఛార్జీలను పెంచిన ప్రభుత్వం విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బస్సులను ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. వెంటనే 464, 205ఎం బస్సుల సంఖ్యను పెంచాలని, గాయపడిన విద్యార్థిని వైద్య ఖర్చులను ఆర్టీసీ యాజమాన్యం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనను ఉదృతం చేస్తామన్నారు. ఈ మేరకు డిపో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐడీఎస్ఓ ప్రతినిధులు నితీష్, సృజన్, ప్రతిభ, వినోద్, నాగరాజుతో పాటు అవంతి కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్న బీజేపీ




ప్రదర్శన నిర్వహిస్తున్న టిఆర్ఎస్ నాయకులు

**ఎల్.బి.నగర్, నవంబర్ 4 (ప్రభాతవార్త):** బిజెపి దేశాన్ని విచ్ఛిన్నంచేస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తుందని గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవానిప్రవీణ్‌కుమార్, డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్ ఆరోపించారు. టిఆర్ఎస్ ఎమ్మెల్యేలను బేరసారాలతో లోంగపర్చుకోవలని కపట నాటకం ఆడుతున్న బీజేపీపై టీఆర్ఎస్ నాయకుల యుద్ధం మొదలైందని శుక్రవారం టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ పార్టీ అరాచకాల నుండి కాపాడాలని టిఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్‌ప్రెసిడెంట్ రమణరెడ్డి, రవీందర్‌రెడ్డి, కృష్ణ, ప్రదీప్‌గౌడ్, విక్కీగౌడ్, నాగరాజు, టాగోర్ శైలజ, పరమేశ్వరి, లక్ష్మి, వాణి, హసీనా, ఉమ, ఉష, నిరంజన్, నాగమణి పాల్గొన్నారు.

## ప్రజల సంక్షేమానికి కృషి : ఆజంఅలీ



ఆజంఅలీని కలిసిన అనితానాయక్, భూమేష్ తదితరులు

**మలక్‌పేట, నవంబర్ 4 (ప్రభాతవార్త):** ప్రజలకు ఎళ్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తామని మలక్‌పేట నియోజకవర్గ టిఆర్ఎస్ ఇంఛార్జి ఆజం అలీ పేర్కొన్నారు. ఆజంపురండివిజన్‌లోని ఆజం ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండి పార్టీ పటిష్టతకు, నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ అనితానాయక్, వైస్ ఛైర్మన్ భూమేష్, డైరెక్టర్లు మైల రవికాంత్, బట్కిరి విద్యానంద్, రాముయాదవ్, అభిషేకం, ప్రవీణ్‌కుమార్, నరేష్, యాదగిరి, సల్మాన్‌ఖాన్, ఎజాస్, లలిత, నాయకులు లాయక్‌అలీ, ప్రవీణ్‌కుమార్, హయత్ హుసేన్ హబీబ్, కామేష్, మారుతి, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## రావినూతల శశిధర్‌కు డాక్టరేట్



శశిధర్‌ను అభినందిస్తున్న ప్రముఖులు

**వనస్థలిపురం, నవంబర్ 4 (ప్రభాతవార్త):** వనస్థలిపురంకు చెందిన విహెచ్‌పి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఓయు న్యాయశాఖ విభాగంలో యాంటీ టెర్రరిజం లాస్ ఇన్‌పోస్ట్ 9/11 వరల్డ్ అండ్ ఇండియాస్ లాస్ – ఎ కంపారేటివ్ స్టడీ అనే అంశంపై ప్రొఫెసర్ ఎస్‌బి ద్వారకానాథ్ పర్యవేక్షణలో పరిశోధన చేసిన రావినూతల శశిధర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. అమెరికా జంట పేలుళ్ల అనంతరం ఉగ్రవాదాని అణిచివేడయానికి వివిధ ప్రపంచ దేశాలు చేసిన తీవ్రవాద వ్యతిరేక చట్టాలు, వాటి పనితీరు, భారతదేశంలో వివిధ రూపాలలో ఉన్న తీవ్రవాద మూలాలు, తీవ్రవాదాన్ని అణిచివేడయంలో భారత్‌లో ఉన్న చట్టాల పనితీరు, నూతన చట్టాల ఆవశ్యకత, తీవ్రవాద వ్యతిరేక చట్టాల అమలులో కోర్టుల పాత్ర, కఠిన చట్టాల ఆవశ్యకత, మానవ హక్కుల రక్షణ తదితర అంశాలపై లోతైన అధ్యయనంతో కూడి పరిశోధన థిసిస్‌ను శశిధర్ సమర్పించారు. ఈ పరిశోధనకు సంబంధించి పలు అంశాలపై ఆయన వ్రాసిన పలు ఆర్టికల్స్‌ను ప్రముఖ జర్నల్స్ ప్రచురించాయి. పరిశోధనలో భాగంగా జాతీయ భద్రతకు సంబంధించిన పలు జాతీయ స్థాయి సెమినార్‌లలోసైతం శశిధర్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో అనేక విద్యార్థి ఉద్యమాలకు, సామాజిక ఉద్యమాలకు నాయకత్వం వహించిన శశిధర్ తీవ్రవాద వ్యతిరేక చట్టాలపై విస్తృత పరిశోధన చేసి డాక్టరేట్ సాధించడంపై పలు రంగాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు. విహెచ్‌పి రాష్ట్రఅధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఎల్‌బినగర్ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ శ్రీనివాస్,విహెచ్‌పి జిల్లా కార్యదర్శి వెంకన్న, శ్రీధర్‌రెడ్డి తదితరులు ఆయనను అభినందించారు.